

సంగీతం.. కళే కాదు.. అది సంస్కృతీ, సంప్రదాయా లను నేర్పుతుంది. అవసరానికి ఉపాధిగా ఉంటుంది. అందుకే అందరూ సంగీతం నేర్చుకోవాలి.' అని ప్రముఖ గాయని, పద్మవిభూషణ్, దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సోదరి ఎస్పీ శైలజ అన్నారు. నెల్లూరులో జరుగుతున్న 60వ త్యాగరాజస్వామి స్వర్ణోత్స వాల కోసం విచ్చేసిన ఆమె 'ఆంధ్రజ్యోతి'తో ముచ్చటించారు.

సంగీతం అందరూ నేర్చుకోవాలి

సంప్రదాయాలు నేర్పడమే కాదు.. ఉపాధినీ ఇస్తుంది!

నాన్న, అన్న ప్రోత్సాహం వల్లే నేను ఈ స్థాయికి..

'ఆంధ్రజ్యోతి'తో ప్రముఖ గాయని ఎస్పీ శైలజ

ఇంటర్వ్యూ



? త్యాగరాజ స్మరణోత్సవాల నిర్వహణ ఎలా ఉంది

! నెల్లూరులో త్యాగరాజ స్మరణోత్సవాలు అజరామరం. 60 సంవత్సరాల క్రితం మా నాన్న పండితారాధ్యుల సాంబమూర్తి, ఆయన మిత్రులు భిక్షాటన పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభ ఏర్పాటు చేసి ఆయన ఆరాధన ఉత్సవాలు జరుపుకున్నారు. ఆ పరంపర ఇప్పటికీ కొనసాగుతోంది.

? ఇంత ఆదరణ ఎలా వచ్చింది.

! నగరంలో సంగీతం, ఇతర కళలు నేర్చుకున్న కళాకారులతోపాటు ఆరాధకులు, పోషకులు ఉన్నారు. అలాగే మా నాన్న హయాం నుంచి భిక్షాటన పూర్వక శ్రీ త్యాగరాజ స్మరణోత్సవ సభకు క్రమశిక్షణ, ధర్మబద్ధత కలిగిన కార్యవర్గం ఉంది. మా నాన్న, ఆయన మిత్ర బృందం ఆశయం కొనసాగిస్తూ ఈ సంగీత మహా యజ్ఞం చేస్తు న్నారు.

? ఈ కార్యక్రమాలకు మీ అనుబంధం

! త్యాగరాజ స్మరణోత్సవాలు మా తండ్రి పండితారాధ్యుల సాంబమూర్తి మిత్రబృందం కొనసాగించింది. ఆయన అనంతరం మా అన్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఈ కార్యక్రమాలు జరిగాయి. ఇప్పుడు ఆయన కుమారుడు చరణ్ స్మరణోత్సవ సభ శాశ్వత కార్యదర్శి యనమండ్ర నాగదేవి ప్రసాద్, మిత్ర బృందం కొనసాగిస్తున్నారు. ఇది ఇలాగే ఎంతో వైభవంగా సాగుతుంది.

? మీ ఇంటిలో వేద తరగతులు జరుగుతున్నాయా

! మా అన్నగారు హయాంలో నగరంలోని మా ఇంటిని కంచి పీఠానికి అందజేశాము. అయితే, ఆ ఇంట్లో డ్రైనేజీ సమస్య ఏర్పడటంతో కొద్దిరోజులు కంచిపీఠం వేద తరగతులు నిర్వహించలేదు. ఇప్పుడు రిపేర్లు పూర్తవడంతో తరగతులు జరుగుతున్నాయి.

? నెల్లూరుకు వస్తే మీకేం అనిపిస్తుంది.

! నా బాల్యస్మృతులు జ్ఞాపికి వస్తాయి. నా స్నేహితులు, బంధువులు ఆప్యాయంగా పలకరింపులు ఆనందాన్ని ఇస్తాయి. అన్న బాలసుబ్రహ్మణ్యం లేనిలోటు కనిపిస్తోంది. సంగీత ప్రపంచంలో ఆయన స్థానాన్ని సాధించేవారు మా కుటుంబంలో చరణ్‌కే ఉంది. కష్టపడుతున్నారు. అభిషేక్ (చిన్న కుమారుడు) కూడా సంగీతం, పాటలు పాడుతున్నాడు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ వద్ద పని చేస్తున్నారు.

? సినీ గాయనిగా కొనసాగుతున్నారా

! లేదండీ. సినిమా పాటలు పాడటం మానేశారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లలో సంగీత కచేరీలు చేస్తున్నాను. వీటితోపాటు టీవీ ప్రోగ్రామ్‌లు కూడా చేస్తున్నాను. నాడు మా తండ్రి, అన్న ప్రోత్సహమే నన్ను సంగీత విద్వాంసురాలిని చేశాయి. ప్రతి ఒక్కరూ సంగీతం నేర్చుకోవాలి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

కార్పొరేషన్ పద్దు రూ.695.95 కోట్లు

నెల్లూరు (సిటీ), మార్చి20, (ఆంధ్రజ్యోతి) : భారీ బడ్జెట్ తో నగరపాలక సంస్థ సిద్ధమైంది. ఆదాయం, ఖర్చులను లెక్కకట్టి భారీ పద్దును ఈ నెల 26వ తేదీన కౌన్సిల్ సమా వేశంలో ప్రవేశపెట్టేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది. రూ.695.95 కోట్లతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలని కార్పొరేషన్ అధికారులు దాదాపుగా పొద్దు సిద్ధం చేశారు. మేయర్ స్రవంతి నేతృత్వంలోని కౌన్సిల్ సమావేశంలో ఈ పొద్దును సభ్యుల ముందుకు తీసుకు రానున్నారు. గతేడాది ప్రారంభ నిల్వ రూ.121.30 కోట్లు కలుపుకుని రానున్న ఏడాది ఆదాయంగా రూ. 585.48 కోట్లుగా లెక్కకట్టిన అధికారులు మొత్తంగా రూ. 706.79 కోట్లుగా చూపనున్నారు. కాగ అందులో అన్ని రంగాలకు పెట్టే ఖర్చు రూ. 695.95 కోట్లుగా ఉంటుందని యంత్రాంగం భావిస్తోంది. ఈ మేరకు బడ్జెట్‌కు తదు పరి తుది మెరుగులు దిద్దుతున్న అధికారులు 26వ తేదీన పై మొత్తాన్ని అధికారికంగా కౌన్సిల్లో విడుదల చేయనున్నారు. ప్రతి ఏడాదిలో ఆదాయ వనరులను పెంచుకుంటూ వెళ్తున్న కార్పొ రేషన్ అధికారులు అవి ఖజానా దాక రావడం లేదన్న ప్రధా న విమర్శను మూటకట్టుకుంటున్నారు. అనేక మార్గాల ద్వారా ఆదాయం ఎన్ఎంసీకి ఉన్నప్పటికీ వాటిని కాగితాల్లో చూపి చేతులు దులుపుకుంటున్నారు. పైగా బడ్జెట్‌లో ఖర్చు చేస్తున్నట్లు చూపుతన్న లెక్కల్లోనూ స్పష్టత కరువవుతోంది. సీసీ రోడ్లు, డ్రైన్లు, సుందరీకరణ, చెత్త తరలింపులకు మినహాయిస్తే మిగిలిన రంగాలకు చూపుతున్న ఖర్చుల్లో వాస్తవం దూరంగా ఉంటుందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈసారైనా అధికారులు ఆదాయం, ఖర్చుల పై చిత్త శుద్ధితో వ్యవహరించాలని నగర వాసులు కోరుతున్నారు.



తెప్పపై దేవేరులతో కలిసి విహరిస్తున్న రంగనాథుడు

తెప్పపై రంగడి విహారం

పండు వెన్నెల కాంతి.. అశేష భక్తజనం నడుమ తల్పగిరి రంగనాథుడు తన దేవేరులతో కలిసి గురువారం రాత్రి తెప్పపై విహరించారు. ఈ ఉత్సవంతో ఇక్కడ జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ముగిసినట్టు అయ్యింది. కాగా, రంగనాథ స్వామి ఆలయం నుంచి పెన్నా బ్యారేజీ వరకు విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. విశేష పుష్పాలంకరణలో స్వామి, అమ్మవార్లు కనువిందు చేశారు. ఆలయం నుంచి ఉత్సవర్లను ఊరేగిం పుగా తీసుకువచ్చి తెప్పపై కొలువదీర్చారు. మంగళవాయిద్యాలు, మిరుమిట్లు గొలుపే బాణాసంచా పేలుళ్ల మధ్య తెప్పోత్సవం జరిగింది. వేద మంత్రాలు, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, సర్వదేవతా ఆరాధనా పూజలు జరిగాయి. ఈ కార్యక్ర మంలో చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ధర్మకర్తలు ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. నగర డీఎస్పీ సింధుప్రియ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



- నెల్లూరు, (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

నీరు-చెట్టు...

బిల్లుల లోగుట్టు!

- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు
- నాడు చేయని పనులు చేసినట్లుగా చూపే కుట్ర
- ఆరేళ్ల క్రితం వర్కులకు ఇప్పుడు క్యూసీ సర్టిఫికెట్లు
- ఇరిగేషన్‌లో బరితెగిస్తున్న అక్రమార్కులు
- లెక్కా పక్కా లేకుండా వస్తూనే ఉన్న బిల్లులు

రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత లక్ష్యానికి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లకు న్యాయం చేయాలని ప్రభుత్వం తలస్తే.. ఆ మాటున అడ్డదారిలో ప్రజాధనాన్ని దోచుకునేందుకు ప్రయత్ని స్తున్నారు. సందట్లో సడే మియాలా నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులో దొంగ బిల్లులు పెట్టేం దుకు కుట్రలు జరుగుతు న్నాయి. కాంట్రాక్టర్లు, రాజకీయ నేతలు ఇందుకు సూత్రధారులు కాగా కొందరు ఇరిగేషన్ అధికా రులు వీరికి సహకరిస్తు న్నారు. 2014-19 మధ్యలో మంజూరైన వర్కులకు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫి కెట్లు ఇప్పుడు మంజూరు చేస్తుం డటం గమ నార్హం. ఈ సర్టిఫి కెట్ల ఆధారంగా బిల్లులు అప్‌లోడ్ చేసేం దుకు ప్రయత్నాలు జరుగు తున్నాయి. ఈ బిల్లుల్లో నీకు సగం - నాకు సగం అన్న ఫార్ములాతో అక్ర మార్కులు పావులు కదుపు తున్నట్లు తెలుస్తోంది.

నెల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : 2014-19 మధ్య కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం నీరు-చెట్టు పథకం పేరుతో జిల్లాలో సుమారు రూ.700 కోట్లతో ఇరిగేషన్ పనులు చేపట్టారు. దాదాపుగా అన్ని వర్కులూ రూ.10 లక్షల్లోపు ఉండడంతో వాటిని నామినేషన్ కింద అప్పగించారు. 2016-17, 2017-18 సంవత్సరాల్లో చేసిన పనులకు అప్పట్లోనే బిల్లులు వచ్చేశాయి. అయితే 2018-19 ఏడాది కాలంలో వేల వర్కులను మంజూరు చేయగా వాటిలో కొన్నింటిని పూర్తి చేశారు. ఎన్నికలు రావడంతో మరికొన్ని వర్కులు మొదలుకాలేదు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో నీరు-చెట్టు బిల్లులను ఆపేసింది. చివరకు కాంట్రాక్టర్లు హైకోర్టును ఆశ్రయించి బిల్లులు తెచ్చుకోవడం మొదలుపెట్టారు. ఇలా చాలా వరకూ బిల్లులు మంజూరు కాగా మరికొన్ని కోర్టులో పెండింగ్ ఉన్నాయి. అయితే గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీరు-చెట్టు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కీలక నిర్ణయం తీసుకుంది. పెండింగ్ బిల్లులన్నీ వేగంగా అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఇరిగేషన్ అధికారులు ఆ ప్రక్రియ మొదలుపెట్టారు. అయితే దీనిని కొందరు అక్రమార్కులు అవకాశంగా మలుచుకుంటున్నారు. 2017-19 మధ్య కాలంలో నామినేషన్ మీద పనులు తీసుకొని, ఆ తర్వాత పనులు చేయని వ్యక్తులు కూడా ఇప్పుడు బిల్లులు పొందేందుకు కుట్రలు చేస్తున్నారు. అప్పట్లో అగ్రిమెంట్ ఉంది కాబట్టి పనులు చేసినట్లుగా ఇరిగేషన్ అధికారులను మేనేజ్ చేసుకొని పాత తేదీలతో ఎంబుక్‌లు రికార్డు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎంబుక్‌లు పాత తేదీలతో రికార్డు చేసినా క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్లు మాత్రం పాత తేదీలతో ఇవ్వడం కుదరదు. కాబట్టి ఇప్పుడు క్యూసీ సర్టిఫికెట్లు ఇస్తున్నారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
WATER RESOURCES DEPARTMENT
Quality Control Certificate

2018లో అగ్రిమెంట్ అయిన ఓ వర్కుకు 2023లో ఇచ్చిన క్యూసీ సర్టిఫికెట్

● నాలుగేళ్ల తర్వాత క్యూసీ సర్టిఫికెట్లు

నిబంధనల ప్రకారం ఒక వర్కు పూర్తయిన వెంటనే క్యూసీ సర్టిఫికెట్ ఇవ్వాలి. అందులోనూ నీరు-చెట్టు వర్కులన్నీ రూ.10 లక్షల్లోపు ఉన్నవే కాబట్టి క్యూసీ అధికారుల వెరిఫికేషన్‌కు ఒక రోజుకు మించి సమయం పట్టదు. అలాకాకుండా ఎప్పుడో 2017-18, 2018-19 సంవత్సరాల్లో అగ్రిమెంట్లు చేసుకున్న వర్కులకు 2023, 2022 సంవత్సరాల్లో క్యూసీ సర్టిఫికెట్లు జారీ చేశారు. ఇటువంటి సర్టిఫికెట్లు కొన్ని 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కాయి. 2019 ఎన్నికల తర్వాత పనులే జరగకపోతే మూడు, నాలుగేళ్ల తర్వాత క్యూసీ సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారన్నదే ప్రశ్నగా మారింది. ఈ సర్టిఫికెట్ల జారీ బాగోతం ఇంకా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు ఏ పనిని వెరిఫికేషన్ చేసి సర్టిఫికెట్లు ఇస్తున్నారో క్యూసీ అధికారులే సమాధానం చెప్పాలి. నాడు కూడా ఇరిగేషన్ అధికారులు పాత తేదీలతో ఎంబుక్‌లు రికార్డు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. వీటన్నింటినీ కోర్టుకు వేసి బిల్లులు తెచ్చుకోవాలన్న ప్రయత్నాల్లో ఉండగా, ఇంతలో ప్రభుత్వమే బిల్లుల చెల్లింపునకు నిర్ణయం తీసుకోవడంతో అక్రమార్కుల పంట పండినట్లు చెప్పుకుంటున్నారు. వీరి బాటలోనే ఇప్పుడు మరికొంత మంది అక్రమార్కులు దొంగ బిల్లులు పెట్టుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

అటవీ పనుల ధర 4.36శాతం పెంపు

ఎఫ్ఎస్ఆర్ జోనల్ కమిటీ చైర్మన్ రాజు

- వివరాలు 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.25 (శుక్రవారం సాయంత్రం)

సహారి : 4.57 (శనివారం ఉదయం)



ఓ బంగారు దుకాణంలో తనిఖీలు చేస్తున్న జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారులు

కావలిలో జీఎస్టీ అధికారుల దాడులు

- ఆరు దుకాణాల్లో రికార్డుల పరిశీలన
- బిల్లులు లేకుండా 10 కిలోల బంగారం గుర్తింపు
- మిగిలిన అంగళ్లు మూత

కావలి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కావలిలోని బంగారు దుకాణాలపై గురువారం ఉదయం జీఎస్టీ అండ్ కస్టమ్స్ అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. దుకాణాలు తెరిచే సమయానికి గుంటూరు నుంచి జీఎస్టీ అండ్ కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్లు నాగరాజు, రవికుమార్‌ల ఆధ్వర్యంలో సుమారు 20 మంది అధికారులు, సిబ్బంది 4 కార్లలో బిజీజీ బజారు వద్ద వాలిపోయారు. ముందస్తు సమాచారం మేరకు ఎంచుకున్న ఆరు దుకాణాలలోకి ఒకేసారి ప్రవేశించారు. దీంతో ఆ ప్రాంతంలో ఉన్న మిగిలిన వ్యాపారులంతా దుకాణాలకు తాళాలు వేసి రోడ్లపై ఉండిపోయారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు రికార్డులు, బంగారు నిల్వలను అధికార బృందం పరిశీలించింది. ఎంత బంగారం కొనుగోళ్లు చేశారు.. స్టాక్ పుస్తకాలు, క్రయ, విక్రయాల పుస్తకాలు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. 6 దుకాణా లలో సుమారు 10 కేజీల బంగారం అదనంగా ఉందని గుర్తించి వాటికి టాక్స్‌లు విధించినట్లు తెలిసింది. దాడులకు సంబంధించిన వివరాలను తెలిపేందుకు జీఎస్టీఅండ్ కస్టమ్స్ అధికారులు నిరాకరించారు.

47 గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

- నివారణకు ఆర్‌డబ్ల్యూఎస్ ముందస్తు చర్యలు
- రూ.2.14 కోట్ల ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురవడంతో ఇప్పటివరకు నీటి ఎద్దడి ఏర్పడలేదు. అయితే, ఎండలు ఎక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో ప్రజల దాహార్తి తీర్చేందుకు అధికారులు అప్రమత్తమయ్యారు. ఉదయగిరి, వింజమూరు, కందుకూరు, కొండాపురం మండలాల్లో వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతూ ఉంటుంది. దీంతో ఆయా మండలాల్లోని 47 గ్రామాలను అధికారులు గుర్తించారు. ట్యాంకర్ల ఏర్పాటు, పైపులైన్ మరమ్మతు తదితర వాటికి సంబంధించి రూ.2.14 కోట్లు అవసరం ఉంటుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కలెక్టర్ ఆనంద్‌కు ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా అధికారులు నీటి సరఫరా చేసేందుకు వెసులుబాటు లభించింది.

దిగుబడి లేదాయె..

ధర పలకదాయె!

- శనగ సాగుదారుల్లో దిగాలు
- ఎకరాకు 2 క్వింటాళ్లూ అనుమానమే
- గోదాముల్లో నిల్వ చేసిన రైతుల్లోనూ ఆందోళన

శనగ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. వాతావరణం అనుకూలించక ఈ ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోగా సాగుచేసిన శనగ పైరు కూడా బెట్టకొచ్చేసింది. దీంతో కనీస దిగుబడులు కూడా వచ్చే అవకాశం లేదని అసలు కోతకూలి ఖర్చులు కూడా వస్తాయో రావోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు గత మూడు నెలలుగా శనగ ధరలు తగ్గుతూ వచ్చి నెలరోజులుగా పూర్తిగా ధర పతనం కావటంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. మరోవైపు రెండు, మూడేళ్లుగా రెండు, మూడేళ్లుగా ఏసీలలో నిల్వచేసి ఉన్న రైతులు దారుణంగా పతనమైన ధరతో దిక్కుతోచని స్థితిని అనుభవిస్తున్నారు.

- కందుకూరు, (ఆంధ్రజ్యోతి)

మూడు దశాబ్దాలుగా కందుకూరు డివిజన్‌లో విస్తారంగా శనగ సాగు చేస్తున్నారు. నియోజక వర్గంలోనే ప్రతిఏటా సరాసరిన పదివేల ఎకరాలలో శనగ సాగయ్యేది. అలాంటిది ఈ సంవత్సరం కేవలం పదోవంతు అంటే వెయ్యి ఎకరాలలో మాత్రమే శనగ సాగవగా దిగుబడి సరాసరిన 2 క్వింటాళ్లకు మించే పరిస్థితి లేదు. దీంతో కోత, నూర్పిడి ఖర్చులు కూడా రావని భావించిన రైతులు వదిలేయటానికి సిద్ధపడుతున్నారు. నవంబరు, డిసెంబరు మాసాలలో ఎడతెరపి లేని వర్షాలు కురవటంతో అదనులో శనగ సాగుచేయలేక పోయారు. జనవరి ద్వితీయార్థం వరకు భూములు ఆరుదలకు రాకపోవటంతో అప్పుడు శనగ వేశారు. అదను దాటాక శనగ వేయటం దండగని ఎక్కువశాతం మంది రైతులు పొగాకు వైపు మొగ్గుచూపారు. దీంతో కేవలం వెయ్యి ఎకరాలలోనే శనగ సాగవగా పైరు పెరుగుదల, పూత పిందే దశలో బెట్టకు రావటంతో దిగుబడి లేకుండా పోయింది.



కందుకూరు ప్రాంతంలో గిడసబారి పూత, పిందె లేకుండా పోయిన శనగ పైరు

● భారీగా పతనమైన ధరలు

గత సంవత్సరం కాగ్-2 రకం శనగలు క్వింటం రూ.12,600 వరకు ధర పలికింది. అయితే, పంట రైతుచేతికొచ్చేకొద్దీ ధరను దిగజారుస్తూ వచ్చిన వ్యాపారులు రూ.8500లకు తెచ్చారు. దీంతో రైతులంతా కోల్డ్‌స్టోరేజీ లలో దిగుబడులను నిల్వచేశారు. అయితే సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో శనగల ధరల్లో కదలికవచ్చి క్వింటం రూ.10500లకు చేరినా కొద్దిశాతం మంది మాత్రమే విక్రయించారు. అక్టోబరు తర్వాత మళ్లీ పతనమవుతూ వచ్చిన శనగల ధర ప్రస్తుతం కాగ్ 2 రకం క్వింటాల్ రూ.7200 పలుకుతుండగా దేశీరకం శనగలు క్వింటాల్ రూ. 5800 మాత్రమే ధర పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు. ఏసీ బాడుగలు, వడ్డీలు చూసుకుంటే క్వింటం రూ.12వేలకు అమ్మినా పెట్టుబడులే కళ్లజూడగలుగుతామని అప్పుల పాలవుతామని వాపోతున్నారు. ఈ స్థితిలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుని కోల్డ్ స్టోరేజీలలో ఉన్న పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొండాపురం : మండల పరిధిలోని సాయిపేట, నేకునాంపేట, మర్రిగుంట, వెలిగండ్ల, ఉప్పలూరు, పార్లపల్లి తదితర గ్రామాల్లో రైతులు శనగను అధికంగా సాగు చేశారు. ఒక ఎకరా విస్తీర్ణంలో శనగ సాగుకు దుక్కికి రూ.10 వేలు, విత్తనాలు, పురుగు మందులు, కలుపుతీత, కోత, నూర్పిడి తదితర పనులకు రూ.20 వేల వరకు ఖర్చు అయిందని రైతులు అంటున్నారు. కౌలు భూమి అయితే అదనంగా రూ.15 వేల వరకు ఖర్చవుతుంది. స్ప్రింక్లర్స్ ద్వారా నీటిని అందించడంతో మరో రూ.5వేల నుంచి 6 వేల వరకు ఖర్చయ్యింది. ఖర్చులన్నీ కలిపి సొంత భూమి కలిగిన రైతులకు ఎకరానికి రూ.35 వేలు, కౌలు భూమి చేసిన రైతులకు ఎకరానికి రూ.45-50 వేల వరకు ఖర్చు అయింది. ఇంత భారీ పెట్టుబడులు పెట్టి పంటను పండించిన రైతులకు ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. దిగుబడులు తగ్గడంతోపాటు మద్దతు ధర తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారు. బయట మార్కెట్లో కాక్-2 (ఎర్ర శనగలు) క్వింటా రూ.5500, జేజే (తెల్లశనగలు) క్వింటం రూ.6500 వరకు కొనుగోలు చేస్తున్నారు. గతంతో పోల్చితే ఇప్పటి ధర తక్కువగా ఉందని రైతులు అంటున్నారు. మద్దతు ధరను పెంచి ప్రభుత్వమే శనగలు కొనుగోలు చేసి, ఆదుకోవాలని శనగ సాగుచేసిన రైతులు కోరుతున్నారు.

ఎకరాకు రూ.35వేల వరకు ఖర్చు



కొండాపురం : శనగ పైరును మిల్లర్‌లో వేస్తున్న కూలీలు

క్యాలెండర్ ఆవిష్కరణ

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంకులో గురువారం త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను బ్యాంకు మేనేజరు చంద్రశేఖర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు జీ ప్రసాద్, సభ్యులు జీ సుధాకర్, జీ పెంచలరత్నం, కే నరసింహులు, బీ మాలకొండారెడ్డి, వై మహేంద్ర, వీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8545
వెండి కిలో ధర	రూ. 1,02,100
వెండి ఒక గ్రాము	రూ.105.10

న్యూస్ బాక్స్

క్యాలెండర్ల పంపిణీ



సబ్ రిజిస్ట్రార్‌కు క్యాలెండర్లను అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

ఉదయగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ముద్రించబడిన ఉగాది క్యాలెండర్లను గురువారం సేవాసమితి సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు పోలీస్‌స్టేషన్‌లోని ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, సబ్ రిజిస్ట్రార్ మెల్కి రోషన, ఎంఈవో షేక్ మస్తాన్‌వలి చేతుల మీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు ప్రసాద్, సభ్యులు సుధాకర్, పెంచలరత్నం, నరసింహులు, మాలకొండారెడ్డి, రమణారెడ్డి, కొండారెడ్డి, మధుసూదన్, కొండలరావు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్ట్

కలువాయి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలం దాచూరులో అన్నపై కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో నిందితుడు కండ్లగుంట సుబ్బారెడ్డిని గురువారం అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరచినట్లు కలువాయి ఎస్‌ఐ సుమన్ తెలిపారు. దాడిలో గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విజేతలకు బహుమతులు

ఉదయగిరి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ఉదయగిరి -సీతారామపురం మార్గంలో ప్రవేశపెట్టిన గిఫ్ట్‌స్కీమ్ విజేతలకు గురువారం డీఎం శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారామపురం మార్గంలో టిక్కెట్ ద్వారా గిఫ్ట్‌స్కీమ్‌లో పాల్గొనే అవకాశం ప్రయాణికులకు కల్పించామన్నారు. మొదటి బహుమతి షేక్ గాజుల జాఫర్‌హుస్సేనీ, ద్వితీయ బహుమతి షేక్ సమీనాలు దక్కించుకోవడంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల కోసం ఆధార్ ప్రత్యేక శిబిరం

సంగం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేసేందుకు గురువారం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేశారు. ఈ క్యాంపును ఎంపీడీవో షాలెట్ పరిశీలించారు. ఈ క్యాంపు 22వ తేదీ వరకు ఉంటుందన్నారు. అదేవిధంగా రెండవ విడత 25 నుంచి 28 తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు, చిన్నారుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సమావేశానికి హాజరుకండి



మాజీ ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్న వెలుగొండ సాధన సమితి సభ్యులు

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 23న ఉదయ గిరి షాదీమంజిల్‌లో వెలుగొండ ప్రాజెక్టు సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశానికి హాజరై సంఘీభావం తెలపాలని గురువారం స్థానిక పెట్రోల్‌బంకు ఆవరణలో సాధన సమితి సభ్యులు మాజీ ఎమ్మెల్యేలు బొల్లినేని వెంకట రామారావు, కంభం విజయరామిరెడ్డిలను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి సభ్యులు, ఉదయగిరి, దుత్తలూరు మండలాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.

23న ఆత్మకూరులో ఆత్మీయ సమావేశం

ఆత్మకూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు ఆసరాగా నిలిచేందుకు వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో చేపడుతున్న ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఆత్మకూరుకు చేరుకుంది. ఈనెల 23న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ట్రై సైకిళ్ల పంపిణీ జరగనుంది. అదే క్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 150 మందికి ట్రైసైకిళ్ల పంపిణీకి రంగం సిద్ధం చేస్తున్నారు. సంబంధిత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. సమావేశాలకు వచ్చేవారి కోసం భోజన వసతి కల్పించనున్నారు. ట్రైసైకిళ్ల లబ్ధిదారులకు ఉదయం అల్పాహారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పుట్టగొడుగుల్లా ఆర్‌వో ప్లాంట్లు

- నిబంధనలు పాటించని ప్రైవేట్ వాటర్‌ప్లాంట్లు
- ప్రజల ఆరోగ్యానికి తూట్లు

ఆత్మకూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి వ్యాపారం జోరందుకుంది. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేసినా మినరల్ వాటర్ కొనుగోలుకే ప్రజలు మొగ్గుచూప ుతున్నారు. పట్టణాలతో పాటు మారుమూల గ్రామాల్లో సైతం ప్రతిరోజు ప్రజలు వాటర్ క్యాన్‌ను రూ.10 పెట్టి కొని దాహర్తి తీర్చుకుంటున్నారు. దీంతో ఆర్‌వో ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలిసి తాగునీటి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయల్లా సాగుతోంది. ప్రస్తుతం నీటి వ్యాపారానికి డిమాండ్ పెరగడంతో భూగర్భంలో నుంచి ఇష్టానుసారంగా 5 హెచ్‌పి మోటార్లతో నీటిని తోడేస్తూ అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.



తాగునీటిని విక్రయిస్తున్న ప్రైవేట్ వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు

ఆత్మకూరు నియోజకవర్గంలో ఆర్‌వో ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, చేజర్ల, మర్రిపాడు, సంగం మండలాల్లో 150కు పైబడి ప్రభుత్వ, ప్రైవేట్ వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి. ఆత్మకూరు మండలం లో 8 ప్రభుత్వ, 15 ప్రైవేట్ వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి. అనంతసాగరం మండలంలో 15 ప్రభుత్వ, 3 ప్రైవేట్ వాటర్‌ప్లాంట్లు, మర్రిపాడు మండలంలో 15 ప్రభుత్వ, 6 ప్రైవేట్ వాటర్ ప్లాంట్లు, చేజర్ల మండలంలో 6 ప్రభుత్వ, 18 ప్రైవేట్ ఆర్‌వో ప్లాంట్లు ఉన్నట్లు అధికారికంగా లెక్కలు ఉన్నాయి. అయితే అనధికారికంగా మరో 70 వాటర్‌ప్లాంట్లు ఉన్నాయి. కొందరు అనుమతులు లేకుండానే వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటుచేసి శుద్ధిచేయని నీటిని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఈక్రమంలో ఒక పక్క ప్రజల జేబులకు చిల్లులు పడడమే గాక ఆరోగ్యానికి హాని కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్వో వాటర్‌ప్లాంట్లపై దృష్టి సారించి ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

ఆనకట్ట సుందరీకరణ పనుల పరిశీలన



సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న జలవనరుల శాఖ అధికారులు

ఉదయగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామకొలను పథకంలో భాగంగా ఉదయగిరి ఆనకట్ట సుందరీకరణ పనులను గురువారం ఆత్మకూరు జలవనరుల శాఖ ఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సుందరీకరణ పనుల్లో భాగంగా కట్ట రివిట్‌మెంట్, మట్టి పనులు పూర్తిచేశామన్నారు. ఇక కట్టపై పార్కింగ్ టైల్స్, సోలార్ దీపాలు, బెంచీలు ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. నెల రోజుల్లో సుందరీకరణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ కందుకూరి చంద్రమౌళి, ఏఈ వేణు, గుత్తేదారు అక్కి. భాస్కర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులందరికీ సాగునీరు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గండిపాళెం జలాశయం పరిధిలోని ఆయకట్టు రైతులందరికీ సాగునీరు అందేలా శాసనసభ్యులు కాకర్ల సురేష్ చర్యలు చేపడుతున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చంచలబాబు యాదవ్ అన్నారు. గురువారం జీకొండారెడ్డిపల్లి సమీపంలోని కుడి కాలువలో సాగునీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల రూ. 15 లక్షల నిధులతో కాలువల మరమ్మతులు చేయించి 4వేల ఎకరాలకు సాగునీరు అందించారన్నారు. నీరు వృథా కాకుండా సద్వినియెగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో పంటల సాగుకు రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు కుమ్మిత రమణారెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు చల్లకొలుసు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న చెంచలబాబు యాదవ్

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి



భూ రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో వంశీకృష్ణ

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచవారిపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కావలి ఆర్డీవో వంశీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. వీఆర్వోలు, సర్వేయర్ గ్రామంలో భూసమస్యల పరిష్కారానికి రీసర్వే చేస్తున్నారని, రైతులు అందుబాటులో ఉండి సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వై నాగరాజు, సర్వేయరు శివ, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్స్ విద్యార్థుల గుర్తింపు

అనంతసాగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బడిమానేసిన 11మంది డ్రాప్‌అవుట్ విద్యార్థులను అధికారులు గురువారం గుర్తించారు. ఎంఈవో2 ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిలకలమర్రి, సోమశిల, మంచాలపల్లి జంగాలకాలనీ, చాపురాళ్లపల్లి గ్రామాల్లో విద్యార్థులను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వారి తల్లిందండ్రులకు వివరించారు.



అనంతసాగరం: సోమశిల గురుకుల పాఠశాలలో విద్యార్థిని చేరుస్తున్న ఎంఈవో తదితరులు

● ఉదయగిరి: మండలంలో పాఠశాలల సముదాయాల పరిధిలో విద్యార్థుల డ్రాపవుట్స్, రీజాయినింగ్ వివరాలను సేకరించి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియచేయాలని ఎంఈవో షేక్ మస్తాన్‌వలి సూచించారు. గురువారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాప్-4 పరీక్షలకు సంబంధించిన మార్కులను త్వరితగతిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఆధార్‌కార్డు లేని విద్యార్థుల వివరాలు, అపార్ ఐడీ వివరాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. అనంతరం ఏపీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశ పరీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. గురుకుల పాఠశాలలో విలువలతో కూడిన విద్యనందించడంతోపాటు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తలుపులు తెరుచుకోని ఆరోగ్య కేంద్రం

- రోగుల అవస్థలు



తలుపులు తెరుచుకోని ఆరోగ్య కేంద్రం

వరకుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైద్య సిబ్బంది తీరుపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం తూర్పుబోయమడగలలోని ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటలకు విధులకు హాజరుకావాల్సిన సిబ్బంది 10.40 గంటల వరకు రాకపోగా కనీసం తలుపులు తీసిన పాపాన పోలేదు. జిల్లా కేంద్రానికి శివారు మండలం కావడంతో ఉన్నతాధికారుల తనిఖీలు ఉండవనే ధీమాతోనే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మారుమూల పల్లెల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

జీవనజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అనంతసాగరం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం ద్వారా పేదలకు మేలు చేకూరుతుందని రేవూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం బ్యాంకులో రెండు కుటుంబాలకు ఆ పథకం ద్వారా రూ. 2లక్షల బీమా చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల ఉన్న వారు వార్షికానికి రూ. 436 చెల్లిస్తే బీమా పాలసీ దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి

సచివాలయ అద్దాల ధ్వంసంపై ఫిర్యాదు

ఏఎస్ పేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సచివాలయ అద్దాలు ధ్వంసం చేయడంపై గురువారం పంచాయతీ కార్యదర్శి షరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన షరీఫ్ అనే వ్యక్తి, గండువారిపల్లి గ్రామానికి చెందిన మస్తాన్, మరో ఇద్దరు కలిసి బుధవారం సాయంత్రం మద్యం మత్తులో సచివాలయ ఆవరణలోకి ప్రవేశించి అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కార్యదర్శి షరీఫ్ ఎస్‌ఐ సైదులుకు ఫిర్యాదు చేశారు.

ఆ భవనంలో క్షణ క్షణం.. భయం భయం

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం, పశువుల ఆసుపత్రి ● బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు


ఏఎస్ పేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన భవనంలో క్షణ క్షణం భయం భయంగా విధులు నిర్వహించాల్సి వస్తోందని పశు సంవర్థక శాఖ, గ్రంథాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి స్లాబు పెచ్చులూడి పడుతూ ప్రమాదకరంగా మారింది. గ్రామంలోని గ్రంథాలయ భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎప్పుడు కూలుతుందోనని భయపడి పాఠకులు గ్రంథాలయనికి రావడానికి భయపడుతున్నారు.

వర్షం కురిస్తే కష్టమే

గ్రంథాలయంలో దిన, వార, మాస పత్రికలతో పాటు విజ్ఞాన, వినోద, గణిత, సైన్స్ పుస్తకాలు, పలు పోటీ పరీక్షల మెటీరియల్ ఉన్నాయి. కానీ వర్షాలు కురిస్తే వాటిని కాపాడుకోవడం తలకు మించిన భారంగా మారిందని, పుస్తకాలపై పట్టాలు కప్పి కాపాడుకోవలసిన దుస్థితి ఏర్పడిందని గ్రంథాలయ అధికారి ఆవేదన వ్యక్తం చేశారు.

శిథిలమైన భవనంలో బిక్కుబిక్కుమంటూ విధులు

శిథిలావస్థకు చేరిన భవనంలో ఒక భాగంలో పశువుల ఆసుపత్రి, మరో భాగంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. దీంతో గ్రంథాలయానికి వచ్చే పాఠకులు, పశువుల ఆసుపత్రికి వచ్చే రైతులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. పశువుల ఆ సుపత్రి గది స్లాబ్ దెబ్బతిని పెచులూడి పడుతూ మందులు పాడైపోతుంటే గతంలో ఉన్న అధికారులు స్లాబ్ కింద సిమెంటు రేకు లు అమర్చారు. దీంతో సిమెంట్ రెకులపై స్లాబ్ పెచ్చులు పడి కూలే ప్రమాదం ఉందని తెలిసినా విధులు నిర్వహించక తప్పడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. నూతన భవనం కోసం గత కొన్ని సంవత్సరాలుగా అధికారులు, నాయకులకు ఎన్ని అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనం నిర్మించాలని ఉద్యోగులు, రైతులు, గ్రంథాలయ పాఠకులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పశువుల ఆసుపత్రి, గ్రంథాలయ భవనం

దాతలు ముందుకు రావాలి : గ్రంథాలయ అధికారి

భవనం శిథిలాస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. తరచూ పెచ్చులూడి పడుతుండడంతో భవనంలో విధులు నిర్వహించాలంటే భయంగా ఉంది. నూతన భవన నిర్మాణానికి ఎంపిడివో, ఎంపీపీకి వినతి పత్రం అందించాను. దాతలు ముందుకు వచ్చి భవన నిర్మాణానికి చేయూతను అందిస్తే బాగుంటుంది.



శిథిలమైన భవనంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి

C.R.I.M.E N.E.W.S

వరి కోత యంత్రం ఆపరేటర్ దుర్మరణం

- రోడ్డు దాటుతుండగా ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

మనుబోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు-మనుబోలు మార్గంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హర్యానాకు చెందిన బల్విందర్ సింగ్ (30)మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. వరికోత యంత్రాల ఆపరేటర్‌గా ఈ నెల2వ తేదీ ఈయన మండలానికి వచ్చాడు. అక్కం పేట, వీరంపల్లి పరిధిలో నడుస్తున్న వరికోత పనుల్లో పాల్గొంటున్నారు. పని ముగియగానే వీరంపల్లి సమీపంలోని పెట్రోల్‌బంకు వద్దకు వచ్చి అక్కడే నిద్రిస్తాడు. ఈ క్రమంలో రాత్రి 10గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పొదలకూరు నుంచి మనుబోలు వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొని వెళ్లడంతో బల్విందర్ సింగ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గురువారం ఉదయం నిద్రలేచి బల్విందర్ సింగ్ కనబడకపోవడంతో వెతుకులాడారు. రోడ్డు పక్కన పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ. శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

నెల్లూరు(క్రైం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు సమీపంలో గురువారం సాయంత్రం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... 40నుంచి 45 వ్యక్తి మరణించాడు. మృతదేహంపై ఆకుపచ్చ హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, బ్లూ రంగు షార్ట్ ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ఫ్లాట్‌ఫారమ్‌పై మరొకరు..

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో 4వ నెంబరు ప్లాట్‌ఫామ్‌పై గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతిచెందారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ జీ.మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 40ఏళ్ల వ్యక్తి మృతదేహంపై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయి. అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

మర్రిపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ కొడుకు తండ్రిని హతమార్చిన సంఘటన బుధవారం రాత్రి మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చుంచులూరు గ్రామానికి చెందిన చీలపోగు చిన్నయ్య (43) కుమారుడు శివకుమార్ మద్యానికి బానిసై నిత్యం తల్లిదండ్రులను డబ్బులు ఇవ్వమని హింస్తూ ఉండేవాడు. దీంతో తల్లి పెంచలమ్మ కొంతకాలంగా బుచ్చిలో తమ పెద్ద కుమార్తె వద్ద ఉంటోంది. తండ్రి చిన్నయ్య, శివకుమార్ ఇద్దరు మాత్రమే ఇంట్లో ఉండేవారు. ఈనేపథ్యంలో శివకుమార్ బుధవారం రాత్రి మద్యం తాగివచ్చి డబ్బుల కోసం చిన్నయ్యతో గొడవపడి తీవ్రంగా కొట్టాడు. ఇంటిలో నుంచి కేకలు వినిపిం చటంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి శివకుమార్ పరారయ్యాడు. చిన్నయ్య కిందపడి కొట్టుకుంటుండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనం వచ్చేసరికే చిన్నయ్య మృతిచెందాడు. ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్‌ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, పరారీలోని నిందితుడు శివకు మార్‌ని గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

కమ్మవారిపాలెంలో మహిళలపై దాడి

- ముగ్గురికి తీవ్రగాయాలు

జలదంకి, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారి పాలెంలో గురువారం మహిళలపై ఓ యువకుడి దాడిచేయగా, ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన కరియావుల కుమార్ అదే గ్రామంలోని వరుసకు తోడికోడళ్లు అయిన పమిడి విజయమ్మ, రాములమ్మలతో పాటుగా రాములమ్మ కుమారుడు శివప్రసాద్‌లపై విచక్షణారహితంగా గొడ్డలితో దాడి చేశాడు. దాడిలో వారు తీవ్రంగా గాయపడ్డారు. దాడి సమయంలో బాధితులు పెద్దపెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల నివాసాల వారు వచ్చేలోపే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర వ్యాఖ్యలపై కేసు నమోదు

ఉదయగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యుల పట్ల అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి గురువారం తెలిపారు. పట్టణం మంగళగిరి కాలనీకి చెందిన గాజులపల్లి మధు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుటుంబ సభ్యులను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలతో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిందితుడి అరెస్ట్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన వరికుంటపాడులో వృద్ధురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన కేసుకు సంబంధించి గురువారం గొల్లపల్లి గురవయ్య అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. ఈనెల 16వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిపై అదే గ్రామ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడడంతో ఆమె కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టి అరెస్టు చేసిన యువకుడిని ఉదయగిరి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

రౌడీషీటర్ బైండోవర్

నెల్లూరు(క్రైం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని చిన్నబజారు స్టేషన్ పోలీసులు గురువారం ఓ రౌడీషీటర్‌ను బైండోవర్ చేశారు. పోలీసు ల సమాచారం మేరకు... గాంధీబొమ్మ సెంటర్‌లో ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ తనిఖీలు చేస్తుండగా ఖుద్దూస్ నగర్‌కు చెందిన రౌడీషీటర్ షేక్ జలీల్ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతడిని ఎస్‌ఐ ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. ఎస్‌ఐ అతడిని స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేశారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

దగదర్తి /బిట్రగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సున్నపుబట్టి జాతీయ రహదారిపై గురువారం రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తహసీల్దారు కృష్ణ తెలిపారు. అనుమానాస్పదంగా వస్తున్న లారీని ఆపి, లోడుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఆర్‌ఐ, సిబ్బంది పరిశీలించారని తెలిపారు. డ్రైవర్‌ను ఆరా తీయగా గుడ్లూరు మండలం పెద్దపవని నుంచి చెన్నైలోని రెడ్‌హిల్స్‌కు వెళుతున్నట్లు తెలిసిందన్నారు. లారీలో 520బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించి, పోలీసులకు అప్పగించామని తెలిపారు. మార్కెట్ విలువను బట్టి బియ్యం విలువ రూ.13 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

పోలీసుల నిర్లక్ష్యం.. ప్రజల అవస్థలు

సంగం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుల నిర్లక్ష్యం కారణంగా కుళ్లి దుర్వాసన వస్తున్న చికెన్ వ్యర్థాలతో స్థానిక ప్రజలు అవస్థలకు గురయ్యారు. వివరాల మేరకు.. రెండు రోజుల కిందట స్థానిక పోలీసులు చికెన్ వ్యర్థాలను డ్రమ్ముల్లో తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు.ఆ వ్యర్థాలను గుంత తీసి పూడ్చకుండా కొండ ప్రాంతం వద్ద డ్రమ్ముల్లో ఉన్న చి కెన్ వ్యర్థాలను గుట్టగా పోసి వదిలేశారు. దుర్వాసన భరించలేక ప్రజలు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. స్పందించిన పోలీసులు ఎట్టకేలకు దుర్వాసన వెదజల్లుతున్న చికెన్ వ్యర్థాలను ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీసి పూడ్చి పెట్టారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100) : 425


అంగన్‌వాడీ పిల్లలతో జిల్లా హ్యూమన్ రైట్స్ చీఫ్ సునీల్ తదితరులు

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

బిట్రగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం రామస్వామిపాలెం లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా హ్యూమన్ రైట్స్ చీఫ్ దాసరి సునీల్ గురువారం తనిఖీ చేశారు. పిల్లల పట్ల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎలాంటి భద్రత పాటిస్తున్నారని పరిశీలించారు. తదుపరి పిల్లలకు పౌష్టికాహారాన్న పంచిపెట్టారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ సెక్రటరీ బత్తుల రవిచంద్ర, ఓఆర్‌జీ సెక్రటరీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సదరన్' పరిశీలనలో అవస్థలు

- వసతులు లేక ఇబ్బందులు పడిన దివ్యాంగులు

కావలి, మార్చి20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు గతంలో ఇచ్చిన సదరన్ సర్టిఫికెట్ల పరిశీలనను ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం గురువారం ఏరియా వైద్యశాలకు వచ్చిన దివ్యాంగులకు సరైన వస తులు లేక అవస్థలు పడ్డారు. దూరప్రాంతాల నుంచి ఏరియా వైద్యశాలకు ఆటోలు, ఇతర వాహనాల్లో వచ్చిన దివ్యాంగులకు స ర్టిఫికెట్ పరిశీలన ఎంత సమయం పడుతుందో.. ఈ రోజు అవు తుందో... లేదో...? తెలియక ఇబ్బందులు ఎదుర్కొన్నారు, కూర్చునేం దుకు వసతి లేక అక్కడ నుంచి డాక్టర్ దగ్గరకు వెళ్లేందుకు వీల్ చైర్లు లేక ఇబ్బందులు పడ్డారు. వయసు మీరిన తల్లిదండ్రులు దివ్యాంగులైన వారి పిల్లలను ఎత్తుకుని లోపలకు తీసుకుని వెళ్లలే క ఇబ్బందులు పడ్డారు. రోజుకు 50 మందికి మాత్రమే పరిశీలన చేసేందుకు సమయం వైద్యులకు సరిపోతుండగా, గురువారం 75 మంది దివ్యాంగులు వచ్చారు. వీరు తమ పేర్లు నమోదు కోసం ఆత్రుత పడుతున్నారు. వేసవి కావటంతో అక్కడ నీటి వసతి సరిగా లేక అన్నం అందుబాటులో లేక దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- వసతులు సమకూర్చాలి

దివ్యాంగులకు వసతులు సమకూర్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దివ్యాంగులకు రవాణా సదుపాయంతో పాటు, మంచినీరు, భోజనం సదుపాయం కల్పించాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులకు మరుసటి రోజుకు వాయిదా వేయకుండా వచ్చిన రోజునే పరిశీ లన పూర్తి చేయాలి.

-మండవ వెంకట్రావు, టీడీపీ విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు




సదరన్ సర్టిఫికెట్ పరిశీలనకు వచ్చిన దివ్యాంగులు, దివ్యాంగుడిని ఎత్తుకుని వస్తున్న సహాయకుడు

న్యూస్ బాక్స్

23న చలో తిరుపతి

కందుకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంత మాలసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 23న చలో తిరుపతి నిర్వహించనున్నామని, ఈ కార్యక్రమానికి ప్రకాశం, నెల్లూరు జిల్లాల నుంచి మాలలు పెద్దసంఖ్యలో తరలిరావాలని మాల ఉద్యోగుల సంఘం ఉమ్మడి రాష్ట్రాల మాజీ ప్రధాన కార్యదర్శి పాలేటి కోటేశ్వరరావు, మాలమహానాడు పట్టణ అధ్యక్షుడు బొట్లగుంట శ్రీనివాసులు గురువారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. అన్నీ రాజకీయ పార్టీలు మాలలపై కత్తికట్టాయని, విషయ పరిజ్ఞానం లేని వ్యక్తులతో కమిషన్‌లు వేసి తప్పుల తడక రిపోర్టులతో ఎస్సీ రిజర్వేషన్లను విభజించటం ద్వారా మాలలకు తీరని అన్యాయం చేసేందుకు ప్రయత్నం జరుగుతున్నదన్నారు. దీన్ని మాలలంతా సంఘటితంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తిరుపతిలో జరిగే బహిరంగ సభకు అధికసంఖ్యలో తరలిరావాలని వారు పిలుపునిచ్చారు.

రేపటి నుంచి వాలీబాల్ పోటీలు

ఉలవపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రామాయపట్నం మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు మెరైన్ సీఐ జీ శివన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెరైన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 27 గ్రామాల నుంచి జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.15,000, రెండో బహుమతిగా రూ.12,000, మూడవ బహుమతిగా రూ.8,000, నాల్గవ బహుమతిగా రూ.5,000 నగదుతో పాటు షీల్డ్‌లు ప్రదానం చేస్తామన్నారు. మెరైన్ డీఐజీ గోపీనాథ్ శెట్టి, ఆడిషనల్ ఎస్పీ జీబీఆర్ మధుసూదన్‌రావు పర్యవేక్షణలో పోటీలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ కబడ్డీ పోటీల రెఫరీగా శ్రీనివాసరావు



ఉలవపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరేడు గ్రామానికి చెందిన సాదం శ్రీనివాసరావు జాతీయ కబడ్డీ టోర్నమెంట్ రెఫరీగా ఎంపిక అయ్యారు. ఆయన ఎంపికపై మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు ఓ. శ్రీనివాసులు, పీ. శ్రీనివాసులు, ఎస్.వెంకట్రావు, కే. ప్రభాకర్, జీ. ప్రభాకర్, ఎం మోహనరావు, కబడ్డీ కోచ్ శివ సిసింద్రీ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 27 నుంచి 30 వరకు బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరిగే జాతీయ కబడ్డీ పోటీలకు రెఫరీగా శ్రీనివాసరావుని ఎంపిక చేశారు. ఇందుకుగాను రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ రెఫరీస్ బోర్డు కన్వీనర్ పీ రవీంద్రబాబుకు, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎలమంచి శ్రీకాంత్‌కు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వాయిల శ్రీనుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

ఎస్ఐ బదిలీ

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐ మహబూబ్ సుభానీని ఎస్పీ బదిలీ చేశారు. ఆయన్ను వీఆర్‌కు పిలిపించినట్టు సిబ్బంది ద్వారా తెలిసింది.దీంతో గురువారం ఆయన విధుల నుంచి రిలీవ్ అయి వెళ్లి పోయారు. 8 నెలలపాటు ఇక్కడ విధులు నిర్వహించారు.

చేతిపంపును బాగు చేయరూ...?

బిట్రగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రామస్వామిపాలెం శ్మశానవాటిక వద్ద ఉన్న చేతిపంపు మరమ్మతులకు నోచుకోవడం లేదు. అంత్యక్రియలకు వచ్చే వారు నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. పాడైపోయి నెల కావస్తున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీనికితోడు ముళ్లచెట్లు పెరిగిపోయినట్లు స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దళిత, గిరిజనవాసులకు శ్మశానం ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


రామస్వామిపాలెం శ్మశాన వాటిక వద్ద పనిచేయని చేతిపంపు

అదనపు నిధుల మంజూరుకు చర్యలు చేపట్టండి


మాట్లాడుతున్న మధుసూదనరావు

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అదనపు ఆర్థిక చేయూత పథకం కింద నిధుల మంజూరుకు ఎంపికైన పక్కా గృహాల నిర్మాణాల లబ్ధిదారులకు నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని కందుకూరు గృహ నిర్మాణ శాఖ ఈఈ ఎస్ మధుసూదనరావు సిబ్బందిని ఆదేశించారు.గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని గృహ నిర్మాణశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ మండలంలో ఈ పథకం కింద ఎంపికైన ఎస్సీలు 1230 మందికి, బీసీలు 677 మందికి ఒక్కొక్కరికి రూ.50 వేలు, ఎస్టీలు ఒక్కొక్కరికి రూ.75 వేలు ఇస్తారని చెప్పారు.పేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది నిర్మల, యాస్మి న్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో మ్యాగజైన్ విడుదల


కళాశాల మ్యాగజైన్‌ను విడుదల చేస్తున్న ఏవో ఆర్వీ రమణారెడ్డి, తదితరులు

బిట్రగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో గురువారం సంహిత పేరుతో కళాశాల మ్యాగజైన్-2కే24ను ఏవో ఆర్వీ రమణారెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ ఈ మ్యాగజైన్‌లో 2024 జనవరి నుంచి 2024 డిసెంబరు 31 వరకు జరిగిన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ డాక్టర్ ఎస్‌డీ ముజాహిద్దీన్, ఇతర కోఆర్డినేటర్స్, అన్ని విభాగాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి



బీమా పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్బీఐ ఆర్ఎం రాజేష్ తదితరులు

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్బీఐ (హైదరాబాద్) ఆర్ఎం రాజేష్ చెప్పారు.గురువారం లింగసముద్రంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ బ్యాంకులు అందించే పీఎంఎస్‌బీవై, పీఎంజేజేవై, పీఎంఏపీవై, ఎస్ఎస్‌వై పథకాలను ఉపయోగించుకొని ఆర్థిక భద్రత పొందాలన్నారు.ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంకు మేనేజర్ శేషగిరిరావు, అవార్డు స్వచ్ఛంద్ర సంస్థ ప్రతినిధులు, శ్రీనివాసరావు రాజ్యలక్ష్మి, జాషువా, వెలుగు సీసీ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు శారీరక దారుఢ్యం ఎంతో అవసరం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు శారీరక దారుఢ్యం ఎంతో అవసరమని ఎంపీడీవో చేవూరు శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి శారీరక, మానసిక దారుఢ్యంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ నిజాం ఆసుపత్రి వైద్యులు రమేష్, సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు ఫిజికల్‌గా ఫిట్‌నెస్‌తో ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ పని ఒత్తిడిని తగ్గించుకోవాలని తెలిపారు. సెల్‌ఫోన్ వాడకంతో కలిగే లాభనష్టాలను వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సంధ్యాలక్ష్మి, ఈవోపీఆర్డీ సమద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది ఇతరశాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఆర్‌లో ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు

కందుకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిచ్చుకలు మానవులకు స్నేహితులని, పర్యావరణ సమతుల్యతకు పిచ్చుకలు ఎంతగానో దోహదపడతాయని అధ్యాపకులు వివరించారు. పిచ్చుకలను కాపాడుకునేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, వేసవిలో వాటికి గూళ్లు, నీళ్లు ఏర్పాటుచేయటం ద్వారా కొంతవరకు పరిరక్షించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, అధ్యాపకులు ఎస్వీ శ్రీహరి, సుజాత, పీ. రాజగోపాల్, తిరుపతిస్వామి, జ్యోతి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పునర్నిర్మాణానికి చర్యలు


పైకప్పు లేచిపోయి పిల్లర్లు మాత్రమే మిగిలి ఉన్న చెత్త సంపద కేంద్రం

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో నిర్మించిన చెత్త సంపద సృష్టి కేంద్రం పునర్నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు.సుమారు పదేళ్ల క్రితం తాటాకుల కప్పుతో నిర్మించిన ఈ కేంద్రం పైకప్పు లేచిపోయి పిల్లర్లు మాత్రమే మిగిలాయి. ప్రస్తుత ప్రభుత్వ అధికారులు ఈ కేంద్రాన్ని సందర్శించి, పునర్నిర్మాణానికి 9 లక్షల రూపాయలతో ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

శిథిలభవనంలో గ్రంథాలయం



అల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పరిధిలోని బాపూజీ పార్కులో ఉన్న గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. పాత భవనం కావడంతో పైకప్పు దెబ్బతిని, వర్షానికి ఉరుస్తున్నది. అంతేకాక భవనం కూడా దెబ్బతిన్నది. దీంతో ఏ క్షణం ఏమవుతుందోనని సిబ్బంది, పాఠకులు భయంతో గడపాల్సి వస్తున్నది. అత్యధికులు బయటే కూర్చొని పత్రికలు చూడాల్సి వస్తున్నది. ఈ భవనాన్ని తొలగించి కొత్తది నిర్మిస్తే పాఠకులకు, విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని పట్టణ ప్రజలు అంటున్నారు.

పెరుగుతున్న రోడ్ల ఆక్రమణలు

కావలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల రోడ్లు ఆక్రమణలకు గురవుతున్నా, అధికారులు పట్టించుకోవటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముసునూరు బ్రహ్మంగారి గుడి నుంచి రైల్వే ట్రాక్‌కు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డుపై కట్టడాలు నిర్మించారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. పట్టణ జనాభా, వాహనాల సంఖ్య పెరుగుతున్నా, ఉన్న కొద్దిపాటి రోడ్లు కూడా ఆక్రమణలతో కుంచించుకు పోతున్నాయి. అధికారులు స్పందించి ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.


ముసునూరులో సీసీ రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాలు

ట్రాక్టరు ఢీకొని వ్యక్తికి గాయాలు

కావలి రూరల్, మార్చి(ఆంధ్రజ్యోతి): మోటారు బైక్‌ను ట్రాక్టర్ వెనుక నుంచి ఢీ కొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ సంఘటన గురువారం పెద్దపవని రోడ్డులోని పీజీ సెంటర్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు, జలదంకి మండలం రామవరప్పాడుకి చెందిన దినేష్, మోసక్ లు మోటారు బైక్ పై కావలి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్ బ్రేక్ వేయడంతో బైక్ ట్రాక్టర్‌ను ఢీ కొంది.తీవ్రంగా గాయపడిన దినేష్‌ను ఏరియా వైద్యశాలకు తరలించి, ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.

చిట్టడవి కాదు.. జగనన్న లేఅవుటే..!

- లెవలింగ్, అంతర్గత రహదారుల ఏర్పాటుకు రూ.25 లక్షల వ్యయం
- ఇళ్లు నిర్మించకపోవడంతో చిల్లచెట్లతో నిండిన వైనం

లింగసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ సమీపంలో ఐదేళ్ల కిందట ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్ చిల్లచెట్లతో నిండి చిట్టడవిని తలపిస్తోంది. లింగసముద్రం గ్రామ సర్వే నంబరు 40లో పశువుల మేతకు పోరంబోకుగా ఉన్న స్థలాన్ని రెవెన్యూ ఉన్నతాధికారులు కన్వర్షన్ చేసి సర్వే నంబరు 326గా మార్చి జగనన్న లేఅవుట్ కోసం ఎ4.70సెంట్లను కేటాయించారు. గ్రామంలోని 154మందిని పక్కా గృహాల లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. ఇందులో వారికి స్థలాలను కేటాయించారు. అయితే ఈ ఎ 4.70 సెంట్లలో జంగిల్ తీసి, చదును చేసి, అంతర్గత రోడ్లు ఏర్పాటు వేసేందుకు అధికారులు ఉపాధిహామీ పథకం నిధులు రూ.25లక్షలు మంజూరు చేశారు. దీంతో ఈ భూమిని చదును చేసి, అంతర్గత మట్టి రోడ్లను ఏర్పాటు చేశారు. అలాగే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫా ర్మర్‌ను ఏర్పాటు చేసి వైరింగ్ కూడా లాగారు. అంతేకాక బోరు ఏర్పాటు కోసం కేసింగ్ పైపు అమర్చారు. గృహాలు మంజూరైన వారికి నిర్మాణానికి రూ.1.80లక్షలు మాత్రమే మంజూరు కావడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఆసక్తి చూపలేదు. ఇందులో పట్టాలిచ్చిన లబ్ధిదారుల్లో కొందరు అనర్హులు కూడా ఉన్నారని ఆరోపణలున్నాయి. ఇరవై ఎకరాలు ఉన్నవారు, ఇంకా ట్రాక్టర్లు, కార్లు ఉన్న వారు కూడా ఉన్నారని విమర్శలున్నాయి. ఇందుకోసం భార్యకు ఒకటి, భర్తకు ఒకటి విడిగా రేషన్‌కార్డులు మార్చుకున్నట్టు తెలిసింది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


చిల్లచెట్లతో నిండిన జగనన్న లేఅవుట్



ఆయకట్టు స్థిరీకరణ చేపట్టాలి : కావలి ఎమ్మెల్యే

కావలి, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చినా, సాగునీటి ప్రాజెక్టులు, పెద్ద పెద్ద చెరువుల కింద ఆయకట్టు స్థిరీకరణ చేపట్టలేదని కావ లి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. అసెంబ్లీలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. ఆయకట్టు స్థిరీకరణ చేపట్టి రైతులకు న్యాయం జరిగేట్లు చూడాలన్నారు. రాజధాని ప్రాంతం కూడా వ్యవసాయేతర భూములుగా మారినా ఇరిగేషన్ రికార్డుల్లో ఇంకా వ్యవసాయ భూమిగా చూపుతున్నారన్నారు. మంత్రి నారాయణ ఆసుపత్రి వందలాది ఎకరాల్లో ఉన్నా, ఇంకా అది కూడా నీటి పారుదల ఆయకట్టు కింద చూపిస్తున్నారన్నారు. ఇపక్పటికైనా రెవెన్యూ, నీటిపారుదల, వ్యవసాయ శాఖల అధికారులు కమిటీగా ఏర్పడి నూతన ఆయకట్టును స్థిరీకరించాలని కోరారు. ఇందుకు ఇరిగేషన్ మంత్రి సానుకూలంగా స్పందించారు.

పది మద్యం సీసాల స్వాధీనం

కావలి రూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బుడంగుంట గ్రామంలో గురువారం బెల్టుదుకాణంపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో శెట్టిపల్లి ప్రేమ్‌చంద్‌ను అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

గడ్డిచుట్టే యంత్రంలో చిక్కుకుని తీవ్రగాయాలు

కావలి రూరల్ : ట్రాక్టర్‌తో గడ్డి చుట్టే యంత్రంలో ప్రమాదవశాత్తు డ్రైవర్ వెంకటేశ్వర్లు చేయి చిక్కుకోవటంతో నుజ్జు నుజ్జు అయింది.ఈ సంఘటన గురువారం రాత్రి కావలి మండలం కొత్తపల్లిలో చోటుచేసుకుంది. ఆర్సీపాలెంకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లు కొత్తపల్లిలో పొలంలో గడ్డిచుట్టే యంత్రంతో గడ్డి చుడుతున్నాడు. యంత్రంలో పురికొస చిక్కుకోవడంతో ఆయన యంత్రంలో చేయిపట్టి దాన్ని తీసే క్రమంలో మోచేతి పైవరకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో కేకలు వేయడంతో స్థానికులు ట్రాక్టర్ ఇంజన్ ఆపి చేతిని బయటకు లాగారు. వెంకటేశ్వర్లును మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.

పెంచలస్వామి సేవలో సినీ గాయని ఎస్పీ శైలజ


పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ శైలజ

రాపూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : పెంచల కోన లక్ష్మీనర సింహ స్వామిని గురువారం సినీ గాయని ఎస్పీ శైలజ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గుండ్లురు సీత రామయ్య స్వామి, శశి స్వామి తదితరులు పాల్గొన్నారు.



సీఎం నుంచి బహుమతి అందుకుంటున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

క్రీడా సంబరం

విజయవాడలో జరుగుతున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేత జట్లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

- విజయవాడ (ఆంధ్రజ్యోతి)


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ప్రశాంతిరెడ్డి తదితరులు

మూల్యాంకనం నిబద్ధతతో చేయాలి

నెల్లూరు(విద్య) : ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకన విధులను సిబ్బంది నిబద్ధతతో నిర్వహించాలని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు సూచించారు. నెల్లూరులోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో గురువారం ఫిజిక్స్, ఎకనామిక్స్ మూల్యాంకనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆర్ఐవో మాట్లాడారు. మొత్తం 750 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, ఏప్రిల్ మొదటి వారంలోగా స్పాట్ పూర్తవ్వాలన్నారు. శనివారం నుంచి కెమిస్ట్రీ, హిస్టరీ స్పాట్ కూడా ప్రారంభమవుతుందని చెప్పారు.

వ్వా.. హలీమ్!

- రంజాన్‌కు ప్రత్యేక వంటకం
- కులమతాలకు అతీతంగా పెరుగుతున్న ఆదరణ

రంజాన్ మాసంలో అందరికీ గుర్తుకు వచ్చేది హలీమ్. ముస్లిములే కాకుండా ప్రతి ఒక్కరూ ఎంతో ఇష్టంగా ఈ హలీమ్‌ను అరగిస్తారు. ఎన్నో పోషక విలువలు కలిగిన ఈ హలీమ్‌ను నెల్లూరు నగరంతో పాటు జిల్లావ్యాప్తంగా పట్టణాలలో విస్తృతంగా అమ్మకాలు సాగిస్తున్నారు. హైదరాబాద్ నిజాం సైన్యంలో చేరిన అరబ్ సైనికులు, నగరంలో స్థిరపడిన అరబ్బులు, పర్షియన్ల ద్వారా హలీమ్ మనకు పరిచమైందని చరిత్ర చెబుతోంది.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

దక్షిణాసియా, మధ్య ఆసియాల్లో విస్తృతంగా వినియోగించే వంటకం హలీమ్. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు రోజంతా ఉప వాసం ఉండి సూర్యాస్తమయంలో అల్పాహారంగా హలీమ్‌ను తీసుకుంటారు. పోషకాలు మెండుగా ఉండటంతో ఈ వంటకం ఉపవాసంతో ఉన్నవారికి తక్షణ శక్తినిచ్చేలా పని చేస్తుంది. ఇక హలీమ్‌ను మటన్, చికెన్‌తో హలీమ్ తయారు చేస్తారు. వీటితోపాటు గోధుములు, నెయ్యి, అల్లం వెల్లుల్లి పేస్ట్, శనగపప్పు, మినపప్పు, దనియాలు, జీలకర్ర, వాము, దాల్చిన చెక్క, యాలకులు, లవంగాలు, నల్ల మిరియాలు, కుంకుమపువ్వు, రోజా పూల రెక్కలు, కొండ ఆకులు, పిస్తా, జీడిపప్పు, అంజీరా, బాదం ఇలా అనేక రకాల వస్తువులను హలీం తయారీలో వాడతారు. హలీమ్ తయారీకి ఎక్కువ సమయం పడుతుంది. గోధుము లు, పప్పులు రాత్రంతా నానబెట్టి బాగా ఉడికించుకుంటారు. మటన్‌ను ప్రత్యేకంగా తయారు చేసిన బట్టిలో ఆరేడు గంటల పాటు ఉడికిస్తూ గోటాతో కలియబెడు తుంటారు. పేస్ట్‌లా తయారై తర్వాత కొత్తిమీర, ఫ్రైడ్ ఉల్లిపాయలు, నిమ్మకాయ ముక్క గార్నిస్ చేసి విక్రయిస్తారు.



మెండుగా పోషకాలు

క్యాలరీలు అధికంగా ఉండే హలీమ్ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఇది తక్షణమే శరీరానికి శక్తిని ఇస్తుంది. ఇందులో ఉండే పీచు పదార్థం కారణంగా నెమ్మ దిగా జీర్ణం అవ్వడంతో పొట్ట ఎక్కువ సేపు నిం డుగా ఉన్నట్లు అనిపిస్తుం ది. హలీమ్‌లో డ్రైఫ్రూట్స్ చేర్చడం వల్ల శరీరానికి మేలు చేస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా అందుతాయి. గోధుములు ఉపయోగించడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉంటుంది. హలీమ్ తయారీకి ఉపయోగించే మసాలా దినుసుల్లో పొటాషియం ఎక్కువగా ఉండటం తో అధిక రక్తపోటు, కిడ్నీ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది.

హైదరాబాద్ నుంచి మాస్టర్లు

హైదరాబాద్ మహానగరానికే పరిమితమైన హలీమ్ 2010 నుంచి నెల్లూరులో తయారుచేసి విక్రయిస్తున్నారు. 2012లో నగరంలో విక్రయ దుకాణాలు ప్రారంభమయ్యాయి. హలీమ్ తయారీ కోసం హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా మాస్టర్లను రప్పిస్తున్నారు. రంజాన్‌కు ముందే మాస్టర్‌లను అడ్వాన్స్ ఇచ్చి హలీమ్ విక్రయించే దుకాణదారులు రిజర్వు చేసుకుంటారు. రంజాన్ మాసం ప్రారంభమవుతున్న మూడు రోజుల ముందే నగరానికి మాస్టర్లు వస్తారు. ఉపవాస దీక్షలు పూర్తయ్యాక తిరిగి తమ ప్రాంతాలకు వెళతారు. మాస్టరు, అసిస్టెంట్‌కు కలిసి నెల రోజులకు రూ.1.60 లక్షలకుపైగా ఇస్తున్నారు. అలాగే 2012లో 250 గ్రాముల మటన్ హలీమ్ రూ.60లకు విక్రయించే వారు. ప్రస్తుతం రూ.200 నుంచి 300 వరకు విక్రయిస్తున్నారు.



పూర్వీకుల నుంచి చేస్తున్నాం



మాది హైదరాబాద్. మా తాత, ముత్తాతల నుంచి హలీమ్‌ను తయారు చేస్తున్నాము. 2012 లో మొదటిసారిగా హలీమ్ చేసేందుకు నెల్లూరు కు వచ్చాను. అప్పటినుంచి ప్రతి సంవత్సరం నెల్లూరుకు వస్తూనే ఉన్నాను. హలీమ్ చేసే సమయంలో గంటల సమయం సెగలో ఉండాలి. అందుకే మజ్జిగ ఎక్కువగా తాగుతూ ఉంటాను. ఇప్పటివరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాలేదు. నెల్లూరు బిర్యాని నేను ఎంతో ఇష్టంగా తింటాను.

- ఎండీ సాధిక్ అలీ, హలీమ్ తయారీదారు

ఆదరణ పెరిగింది

2012 నుంచి హలీమ్‌ను నెల్లూరులో విక్రయిస్తున్నాను. అప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు హలీమ్ తినే వారి సంఖ్య బాగా పెరిగింది. అప్పట్లో రోజుకు ఐదు కేజీల హలీమ్‌ను విక్రయిస్తే ఇప్పుడు 40 కేజీలకు పైగా విక్రయిస్తున్నాము. హలీమ్ విక్రయించే దుకాణాల సంఖ్య నగరంలో బాగా పెరిగింది. మా దుకాణంలో కేజీ హలీమ్ కొనుగోలు చేసిన వారికి ఖుబాని స్వీట్, కూల్‌డ్రింక్‌ను ఉచితంగా ఇస్తున్నాము.



- ఎస్‌కె అఫ్రోజ్, ఆల్‌షాగౌస్ హలీమ్ దుకాణం యజమాని.

సోమశిల జలాశయంలో 54.780 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో మహిళా సాధికారిత

- నుడా చైర్మన్ కోటంరెడ్డి
- ముగిసిన వజ్రోత్సవ వేడుకలు


మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు (విద్య), మార్చి 20 (ఆంధ్ర జ్యోతి) : డీకేడబ్ల్యూ కళాశాలలో మహిళా సాధికారితకు పెద్దపీట వేస్తూ మహిళాభ్యున్నతికి పాటుపడు తున్నారని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అన్నారు. నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా కళాశాల 60 వసంతాల పూర్తి చేసుకున్న సందర్భంగా రెండురోజులు నిర్వహించిన వజ్రో త్సవ వేడుకలు గురువారం ముగిసాయి. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్ర మంలో నుడా చైర్మన్ మాట్లాడుతూ చదువు కున్న విద్యా సంస్థ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు పూర్తి సహ కారం అందించాలన్నారు. వేలాదిమంది విద్యార్థి నులు చదువుకునే ఈ కళాశాలకు తమవంతు పూర్తి సహాయ, సహకారాలు అందచేస్తామ న్నారు. విద్యార్థినులు అవకాశలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి సోదరి, పూర్వ విద్యార్థిని విజయదుర్గ మాట్లాడుతూ పాత స్నేహితు లందరినీ కలుసుకుని జ్ఞాపకాలను గుర్తుచేసు కోవడం ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. అనంతరం విద్య, సాంస్కృతిక విభా గాల్లో రాణించిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. తొలుత దొడ్ల కౌసల్యమ్మ సేవలను స్మరించు కుంటూ, కళాశాల అభివృద్ధి స్లోగన్‌లతో నగరంలోని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, కళాశాల ప్రిన్సిపాల్ డి.గిరి, దివంగత ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి సతీమణి, కళాశాల పూర్వ విద్యార్థిని హేమావతి, దొడ్ల కౌసల్యమ్మ మేనల్లుడు సుధాకర్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాళ్లు డాక్టర్ మస్తా నయ్య, డాక్టర్ శైలజ, వైస్ ప్రిన్సిపాల్ రమణరావు, పూర్వ విద్యార్థినుల సంఘం సభ్యులు జ్యోతిరెడ్డి, కుసుమ కుమారి, తుసలి, శేషమ్మ, జయలక్ష్మి. అధ్యా పక, అధ్యాపకేతర సిబ్బంది, ప్రస్తుత, పూర్వ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న కళాశాల సిబ్బంది, విద్యార్థినులు

పరిశ్రమల స్థాపనకు వెంటనే అనుమతులివ్వాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని శంకరన్ భవన్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పరిశ్రమల ఏర్పాటు అనుమతులను వెంటనే మంజూరు చేయాలన్నారు. దరఖాస్తుల ను క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువు కంటే ముందుగానే అనుమతులు ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూసేకరణను వేగంగా చేపట్టాలన్నారు. ఎంఎస్ఎంఈలకు అవసరమైన పీఎంఈజీపీ రుణాలను వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, డ్వామా పీడీ గంగా భవానీ, ఎల్‌డీఎం శ్రీకాంత్ ప్రదీప్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీ ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెట్టలో మెరిసిన ఆణిముత్యం

గేట్‌లో 425వ ర్యాంకు సాధించిన శేఖర్



ఉదయగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గేట్ పరీక్షా ఫలితాల్లో ఉదయగిరి మండలం జీ.చెర్లోపల్లి పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన దేవండ్ల శేఖర్ ఆలిండియా స్థాయిలో ఈసీఈ విభాగంలో 425వ ర్యాంకు సాధించి సత్తా చాటాడు. గ్రామానికి చెందిన దేవండ్ల వెంకటేష్, నరసమ్మల కుమారుడు శేఖర్. తండ్రి చిన్నతనంలోనే అనారోగ్యంతో చనిపోవడంతో తల్లి కూలి పనులు చేసి చదివించింది. శేఖర్ ప్రాథమిక విద్య గ్రామంలో పూర్తి చేయగా, 6 నుంచి 10వ తరగతి వరకు నందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ ఉదయగిరిలోని మేకపాటి వెంకురెడ్డి మెమోరియల్ జూనియర్ కళాశాల, బీటెక్ జేఎన్‌టీయూ కలికిరిలో పూర్తి చేశాడు. చిన్నతనం నుంచే శేఖర్ విద్యలో రాణిస్తున్నాడు. పదో తరగతిలో 9.5 జీపీఏ, ఇం టర్‌లో 958 మార్కులు, ఎంసెట్ 13790 ర్యాంకు సాధించాడు. ఎలాంటి శిక్షణ తీసుకోకుండా గేట్ పరీక్షలు రాసి తొలి ప్రయత్నంలోనే 425వ ర్యాంకు సాధించి తన ప్రతిభ చాటాడు. ఐఐటీలో ఎంటెక్ పూర్తిచేసి ఉద్యోగం సాధించడమే తన ధ్యేయమని శేఖర్ పేర్కొన్నాడు.

నేతన్నకు భరోసా!

- 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- ఎన్నికల హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం
- జిల్లాలో 3,600 కుటుంబాలకు లబ్ధి

నెల్లూరు (వ్యవసాయం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఇప్పటికే చేనేతల ఇళ్లకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం తాజాగా దాన్ని 200 యూనిట్లకు పెంచుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. గత వైసీపీ ప్రభుత్వం చేనేతలను నిర్లక్ష్యం చేసింది. ఎలాంటి రాయితీలు ఇవ్వలేదు. అంతేగాక నేతన్న నేస్తం పథకం కింద ఏడాదికి రూ.24వేలు ఇచ్చారు. అదికూడా కొందరికే ఇచ్చి చేతులు దులుపు కున్నారు. ఉచిత విద్యుత్ హామీని తుంగలో తొక్కారు. అయితే కూటమి ప్రభుత్వం రాకతో చేనేత కుటుం బాల్లో వెలుగులు వస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే 100 యూని ట్లలోపు వాడిన వారు బిల్లు చెల్లించా ల్సిన అవసరం లేకుండా ఆదేశాలు జారీ చేసింది. తాజాగా దాన్ని 200 యూనిట్లకు పెంచింది.


మగ్గం నేస్తున్న మహిళ

ఉచిత విద్యుత్‌తో ఆర్థిక భరోసా



రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నందుకు సంతోషంగా ఉంది. ఇప్పటికే 100 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందు తోంది. తాజాగా 200 యూనిట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉంది. అయితే దీనిపై అవగాహన కల్పించాలి. అర్హులైన చేనేతలు దరఖాస్తు చేసుకునేలా చర్యలు చేపట్టాలి.

- బుధవరపు బాలాజీ, చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ అధ్యక్షుడు

దరఖాస్తు చేసుకోవాలి!

జిల్లాలో దాదాపు 3600 చేనేత కుటుంబాలు ఉండగా, మరో 6వేల కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నాయి. సంగం, కోవూరు గమళ్లదిబ్బ, పాటూరు, నెల్లూరు రూరల్ నారాయణరెడ్డిపేట, సౌత్‌మోపూరు, ములుముడి, బుచ్చి, ఇందుకూరుపేట, పొదలకూరు, ఉదయగిరి, వింజమూరు, ఏఎస్‌పేట తదితర ప్రాంతాల్లో చేనేత కార్మికులు ఉన్నారు. వీరంతా 100 యూనిట్లలోపు ఉచిత విద్యుత్‌కు అర్హులే. అయితే దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మగ్గాలు ఉన్న కుటుంబాలకు మాత్రమే 100 యూనిట్లలోపు విద్యుత్ వాడితే బిల్లు పూర్తిగా చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ అవకాశాన్ని ఇప్పటికే జిల్లాలో 206 మంది సద్వినియోగం చేసుకుంటున్నారు. చేనేత గుర్తింపు కార్డులతో దరఖాస్తులు చేసుకుంటే ఈ లబ్ధి చేకూరుతుంది.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం తీసుకున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ నిర్ణయం ద్వారా జిల్లాలో దాదాపు 3600 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే 206 కుటుంబాలు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాయి. చేనేత గుర్తింపు కార్డుతోపాటు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రతి నేతన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- పి.వరప్రసాద్, జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి

సంగంలో 'అసుర సంహారం' సందడి

- సినీ షూటింగ్‌లో పాల్గొన్న తనికెళ్ల భరణి

సంగం/బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'అసుర సంహారం' సినిమా షూటింగ్ గురువారం సంగం, బుచ్చిరెడ్డిపాళెంలలో జరిగింది. తొలుత ఓ సన్నివేశాన్ని చిత్రీకరించేందుకు డైరెక్టర్ కృష్ణ కిషోర్‌తో కలిసి ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి సంగమేశ్వరాలయానికి వచ్చారు. సమాచారం అందుకున్న ప్రజలు తనికెళ్ల భరణిని చూసేందుకు భారీగా తరలి వచ్చారు. దీంతో సంగం శివాలయంలో సందడి నెలకొంది. ఆలయానికి వచ్చిన ఆయన మొదట సంగమేశ్వరుడిని, శ్రీ కామాక్షిదేవిని దర్శించుకున్నారు. అనంతరం చిత్రం షూటింగ్‌లో భాగంగా డైరెక్టర్ తనికెళ్ల భరణితో ఒక సన్నివేశం చిత్రీకరించారు. తరువాత సంగం జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడ సబ్బు ప్రవీణ్ కుమార్ డైరెక్టర్ కృష్ణ కిషోర్‌కి చిన్ననాటి స్నేహితుడు. దీంతో సంగంలోని ఆయన ఇంటికి వెళ్లి తనికెళ్ల భరణితో మరో సన్నివేశం చత్రీకరించారు. అలాగే బుచ్చిరెడ్డి పాళెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలోనూ ఈ సినిమా షూటింగ్ జరిగింది.


సంగం శివాలయంలో షూటింగ్‌లో పాల్గొన్న తనికెళ్ల భరణి

అటవీ పనుల ధర 4.36శాతం పెంపు

- ఎఫ్ఎస్ఆర్ జోనల్ కమిటీ చైర్మన్ రాజు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : అటవీశాఖ ద్వారా చేపట్టే పనులకు సంబంధించిన ధరలను రాబోవు ఆర్థిక సంవత్సరానికి 4.36 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు గుంటూరు సర్కిల్ కన్జర్వేటర్, ఎఫ్ఎస్ఆర్(ఫారెస్ట్ షెడ్యూల్ ఆఫ్ రేట్స్) కమిటీ చైర్మన్ ఐకేవీ రాజు పేర్కొన్నారు. నెల్లూరులోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో గురువారం రాష్ట్ర అటవీశాఖ జోన్-4 ఎఫ్ఎస్ఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు. చైర్మన్ రాజు మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం నిర్వహించే కమిటీ సమావేశం ఈసారి డీఎఫ్‌వో మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించామని చెప్పారు. అటవీశాఖ ద్వారా జరిగే పనులకు సంబంధించి 2025 - 26 సంవత్సరానికిగాను ప్రస్తుత ధర కంటే 4.36 శాతం పెంచామన్నారు. ఎలాంటి పనులు చేపట్టాలన్నా కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కన్జర్వేటర్లు యశోదబాయి, కృష్ణమూర్తి, సెల్వం, నరసీతరన్, సాయి బాబా, డీఎఫ్‌వోలు మహబూబ్ బాషా, ధర్మరాజు, నాగార్జున్ రెడ్డి, హారికా పలువురు రేంజర్లు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ చేయించుకోని రేషన్ కార్డుదారులు ఈనెల 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలని డీఎస్వో అంకయ్య ఓ ప్రకటనలో కోరారు. రేషన్ కార్డులోని సభ్యులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోగానీ, రేషన్ డీలర్ వద్దగానీ ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం

పొదలకూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేకంగా స్థానిక విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో గురువారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ డిఫెన్స్ సౌజన్యంతో పొదలకూరు ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమం కాలేజీ అకడమిక్ ఇన్‌చార్జి సీహెచ్. కృష్ణ, అధ్యాపకులు మనోహర్, ప్రతాప్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8545
వెండి కిలో ధర	రూ. 102,100
వెండి ఒక గ్రాము	రూ.105.10

న్యూస్ బాక్స్

ఉపాధి హామీపై రేపు సామాజిక తనిఖీ

ముత్తుకూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులపై శనివారం సామాజిక తనిఖీ బహిరంగ వేదికను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగమణి తెలిపారు. ఈ విషయంపై గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. ఈ నివేదికలను బహిరంగ వేదికలో ప్రజలకు తెలియజేస్తారన్నారు. సామాజిక తనిఖీ కార్యక్రమానికి హాజరై లోటు పాట్లుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

'విమర్శలు సరికాదు'

ముత్తుకూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన బీపీటీ వరి ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని రాష్ట్ర మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే డమ్మాయిపాలెం అధికార పార్టీ నాయకులు ఆయనపై బురదజల్లే విధంగా రాజకీయ విమర్శలు చేయడం సరికాదని వైసీపీ నాయకుడు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి తెలిపారు. ఈ విషయంపై గురువారం ఆయన పోలంరాజుగుంటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాది పుట్టీ ధాన్యంను రైతులు రూ.23వేలకు అమ్ముకున్నారని, ఈ ఏడాది రూ.16వేలుకు కూడా కొనుగోలు చేయడం లేదన్నారు. పుట్టి ధాన్యాన్ని 850కేజీలు తీసుకోవాల్సి ఉండగా అదనంగా మరో 150 కిలోలు తీసుకుంటూ రైతులను దోచుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమం సర్పంచ్ సన్నారెడ్డి హారిక, నాయకులు పాముల శ్రీనివా సులు, దువ్వూరు రామనాథరెడ్డి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన టీడీపీ నేత వంశీకృష్ణారెడ్డి



మంత్రి నారా లోకేష్‌తో చర్చిస్తున్న బెజవాడ వంశీకృష్ణారెడ్డి

విడవలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఊటుకూరు టీడీపీ యువ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి శాసనసభ బడ్జెట్ సమావేశాలు ముగింపు సందర్భంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలసి గురువారం అమరావతిలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడారు. పార్టీ కోసం పనిచేసిన వారికి సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. గతంలో తెలుగు యువత జిల్లాధ్యక్షుడిగా, మండలాధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో నియోజవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని లోకేష్ సూచించినట్లు వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

చేనేత కార్మికులకు ముడిసరుకు అందజేత



నూలుతో చేనేత కార్మికులు

కోవూరు, మార్చి20 (ఆంధ్రజ్యోతి): పాటూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికులకు గురువారం నెల్లూరులోని జిల్లా చేనేత కార్యాలయంలో నూలు ముడిసరకును అధికారులు పంపిణీ చేశారు. చీరలు నేస్తూ కుటుంబాల్ని పోషిస్తున్న పద్మజ, నాగలక్ష్మిలకు ఒక్కొక్కరికి రూ.20వేలు విలువ చేసే ముడిసరకు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ చేనేత విభాగం నాయకుడు కేవీ శేషయ్య మాట్లాడారు. కార్మికుల సమస్యల్ని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారని,అందుకు మహిళలకు ముడిసరకు అందజేయడం అభినందనీయ మన్నారు. ప్రభుత్వం చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్ర మంలో అసిస్టెంటు డైరక్టర్ వరప్రసాద్, అధికారులు మాధవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షకు ముగ్గురు గైర్హాజరు

వెంకటాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ కళాశాలలో గురువారం జరిగిన డిగ్రీ నాలుగో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 84 మంది విద్యార్థుల్లో 81 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

పల్లెకు సంపద..

- గత టీడీపీ పాలనలో చెత్త సంపద కేంద్రాల నిర్మాణం
- వైసీపీ హయాంలో పర్యవేక్షణ లేక నిరుపయోగం
- పునఃప్రారంభంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- గ్రామాల్లో ప్రజలకు విస్తృత అవగాహన



మనుబోలులో చెత్త సేకరణను గమనిస్తున్న సైదాపురం కార్యదర్శులు, క్లాప్‌మిత్రలు

మనుబోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీలకు ఆర్థికపరిపుష్టి సాధించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఒకవైపు ఆదాయం పెంపు..మరోవైపు పల్లెల్లో పారిశుధ్యం మెరుగుదలకు ప్రణాళికను రూపొందించింది. అందులో భాగంగా వైసీపీ పాలనలో నిరుపయోగంగా మారిన చెత్త సంపద కేంద్రాలను పునఃప్రారంభించాలని నిర్ణయించి వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టింది. అందుకు సంబంధించి అధికారులు కసరత్తు ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా గత టీడీపీ హయాంలో ఎన్ని



మనుబోలు చెత్తసంపద కేంద్రంలో పొదలకూరు కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌పీలు (ఫైల్)

కేంద్రాలు నిర్మించారు. అందులో ఎన్ని వినియోగంలో ఉన్నాయి. ఎన్ని నిరుపయోగంగా మారాయి అన్న వివరాలు సేకరించారు. అవసరమైన వాటికి మరమ్మతులు చేయిస్తున్నారు.

ఉపాధి మెటీరియల్ నిధులతో..

గత టీడీపీ ప్రభుత్వం 2014-19లో ఉపాధిహామీ పథకం మెటీరియల్ నిధులతో చెత్త సంపద కేంద్రాల నిర్మాణాన్ని చేపట్టింది. ఉమ్మడి జిల్లాలో 722 పంచాయతీలుం డగా 496చెత్తసంపద కేంద్రాల నిర్మాణం పూర్తి చేసింది. 222 కేంద్రాలకు స్థలం లేకపోవడంతో నిర్మాణాలు నిలిచిపోయాయి. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ కేంద్రాలను పట్టించుకోక పోవడంతో చాలా కేంద్రాలు మూలనపడ్డాయి. గడిచిన నాలుగునెలలుగా 496కేంద్రాలను వినియోగంలోకి తీసుకవచ్చారు. అలాగే ఎక్కడ స్థల సమస్య ఉందో గుర్తించి వాటికి స్థలం కేటాయించి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 496కేంద్రాల్లో చెత్తసేకరణకు 1700మంది క్లాప్‌మిత్రలు పనిచేస్తున్నారు. వీరి సంఖ్యను పెంచే ఆలోచనలు ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రాలు మరుగునపడ్డాయి. కొన్నిచోట్ల మందుబాబులు, జూదరులకు అడ్డాగా మారాయి. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది.

గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన

గ్రామాల్లో గ్రీన్ అంబాసిడర్లను (చెత్తసేకరించే కార్మికులు) ఏర్పాటు చేశారు. ప్రతిరోజూ చెత్తను సేకరణపై ఇటీవల పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాలతో డీపీవో శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి వెళ్లి చెత్తతో కలిగే దుష్పరి ణామాలను వివరించారు. మరో వైపు కేంద్రాలకు తీసుకొచ్చే చెత్తతో సంపద ఎలా సృష్టించాలన్న దానిపై కార్మికులకు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా మండలంలో మనుబోలు చెత్త సంపద కేంద్రంలో రాపూరు, సైదాపురం, పొదలకూరు మండలాల కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు అవగాహన కల్పించి క్షేత్రస్థాయి పరిశీలన, చెత్త సేకరించే విధానం గురించి క్షుణ్ణంగా వివరించారు. త్వరలో నే అన్ని కేంద్రాలను వినియోగంలోకి తీసుకురానున్నారు.

దగా చేస్తున్న దళారులు

- ప్రభుత్వం ప్రకటించిన పుట్టి ధర రూ.19,720
- వారు కొనుగోలు చేసేది రూ.18వేలు నుంచి 17వేలు మాత్రమే
- నత్తనడకన సాగుతున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు



రోడ్డుపై ఆరబోసిన ఉన్న ధాన్యం

కొడవలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వం 14 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. ఈ కేంద్రాల్లో రైతులు ధాన్యం అమ్మితే పుట్టి ధాన్యం మద్దతు ధర రూ.19,720లుగా నిర్ణయించింది. దళారులు మాత్రం అందుకు విరుద్ధంగా రైతుల వద్ద నుంచి పుట్టి రూ.18వేలు నుంచి రూ.17500 కొనుగోలు చేస్తూ రైతులను దగా చేస్తున్నారు. ఈ సమస్యతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల నత్తనడక కొనసాగుతున్నాయి.

ఈ ఏడాది మండలంలో..

సుమారు 15,500 ఎకరాల్లో వరిసాగు చేశారు. కొడవలూరు, తలమంచి, పెయ్యాలపాలెం, గండవరం, మానెగుంటపాడు, రామన్నపాలెం, బొడ్డువారిపాలెం, కమ్మపాలెం గ్రామాల్లో ఎక్కువగా కేఎన్ఎం రకం వరి సాగు చేశారు.

పెరిగిన వ్యవసాయ ఖర్చులు..

అప్పులు తెచ్చి వ్యవసాయ సాగు చేస్తున్నారు. ఎకరాకు పెరిగిన ఖర్చులతో సుమారు రూ.35వేలు ఖర్చు అవుతుంది. వాతావరణం అనుకూలించి దిగుబడి బాగా వచ్చినా రైతు పండించిన ధాన్యంను దళారులు నిలువు దోపిడీ చేస్తున్నారు. దిగుబడులు అమ్మినా చేసిన అప్పులు తీరడం లేదని, కొందరు వడ్డీలు కట్టలేని పరిస్థితుల్లో ధాన్యంను అమ్ముకుంటున్నారు. 15500 ఎకరాల్లో సుమారు ఎకరం 3పుట్లు లెక్కన పండిన సుమారు 4లక్షల పుట్లు పండుతాయి. పుట్టికి దళారులు రూ.2వేల లాభం అమ్ముకుంటున్నారు. ఈ లెక్కప్రకారం 4లక్షల పుట్లు కొట్లలో లాభాలు గడిస్తూ రైతు శ్రమను దోచుకుంటున్నారు. అధికారులు వీరిపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

పొదలకూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాలను గురువారం సాయంత్రం జిల్లా తూనికల కొలతల అధికారి రియాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం బ్యాగ్‌పై 20కిలోలని ఉండడం, బ్యాగ్ లోపల 16 కిలోల బియ్యం ఉండటాన్ని ఆయన గమనించి రూ.12వేల జరిమానా విధించారు.

పరికరాలు తుప్పు పట్టించారు !



మూలనపడ్డ సిమెంట్ తయారీ పరికరాలు

వెంకటాచలం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పక్కా ఇళ్ల నిర్మాణాలకు సిమెంటు తలుపులు, కిటికీలు తయారు చేసి సరఫరా చేసే పరికరాలు అధికారుల నిర్లక్ష్యంతో మూలనపడ్డాయి. 2009కాంగ్రెస్ హయాంలోనే వెంకటా చలంలోని జాతీయ రహదారి పక్కనే గృహనిర్మాణ శాఖ ఆధ్వర్యంలో పరికరాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి రూ.లక్షలు వెచ్చించి పరికరాలు తీసుకొచ్చారు. ప్రారంభించిన కొన్ని నెలలు ఆశించిన ఫలితాలే వచ్చాయి. ఏ మైందో తెలియదు కానీ సిమెంట్ వస్తువుల తయారీని నిలిపివేశారు. ప్రస్తుతం తయారీకేం ద్రంలోని స్థలంలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని (సీహెచ్‌సీ) నిర్మించారు. వారు తయారీ వస్తువులను పక్కన పడేశారు. రూ.లక్షల విలు వజేసే పరికరాలు ప్రస్తుతం తప్పుపట్టి పోయాయి. అధికా రులు స్పందించి వాటిని తిరిగి వినియోగంలోకి తీసు కరా వాలని మండలంలోని పక్కా ఇళ్ల లబ్ధిదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఫలితాలు ఉండేవి..

సిమెంట్ తయారీ కేంద్రంలో తయారు చేసిన వస్తువులు ఇళ్ల లబ్ధిదారులకు అందుబాటులో ఉండేవి. ఇపుడు తయారీ నిలిచి పోవడంతో బయట ప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉంది. .

\- వలిపి వెంకటేష్, ఎర్రగుంట

చర్చి ప్రాంగణమే చదువులకు దిక్కు

- వరండాలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ
- పూర్తికాని కొత్త భవనం



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

ముత్తుకూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తున్నామని చెప్తున్న ప్రభుత్వం, అంగన్‌వాడీ చిన్నారుల ఆలనాపాలనను పూర్తిగా మరిచి పోయింది. అల్లారుముద్దుగా పెరగాల్సిన చిన్నారులు అరకొర వసతుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఇందుకు నిదర్శనంగా మండలంలో ఆముదాలపాడు అంగన్‌వాడీ కేంద్రం నిలుస్తోంది. విద్యాభ్యాసంలో తొలిఅడుగుగా భావించే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ దయనీయంగా మారింది. అముదాలపాడులో భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఏళ్ల తరబడి అంగన్‌వాడీ కేంద్రాన్ని సమీపంలోని చర్చి వరండాలో నిర్వహిస్తున్నారు. ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో మూసి ఉండే చర్చి ప్రాంగణంలో పిల్లలను కూర్చోబెట్టి చదివిస్తున్నారు. సమీపంలోని అంగన్‌వాడీ భవనం 80 శాతం పూర్తయింది, చేసిన పనులకు బిల్లులు రాకపోకడంతో కాంట్రాక్టరు చేతులెత్తేసి వెళ్లిపోయాడు. దీంతో అసాంఘిక కార్యకలాపాలకు ఈ అసంపూర్తి భవనం అడ్డాగా మారింది. ఐసీడీఎస్ అధికారులు ఒకసారి ఈ అంగన్‌వాడీ కేంద్రం దయనీయ పరిస్థితిని చూస్తే ఏమంటారో..? ఇప్పటికైనా చిన్నారులపై కనికరం చూపి, భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని తల్లితండ్రులు కోరుతున్నారు.

కోవూరు చక్కెర కార్మికులను ఆదుకోవాలి

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి





కోవూరు, మార్చి20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వెూడువేలమంది కార్మికు లతో కళకళలాడిన కోవూరు సహకార చక్కెర కర్మాగారాన్ని ఆదుకోవాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఈ విషయాన్ని గురువారం ఆమె అసెంబ్లీలో మాట్లాడారు. గతంలో ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులకు రూ.20 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. 124ఎకరాల్లోని ఫ్యాక్టరీ భూమిని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆదాయం పెంచే చర్యలు తీసుకోవాలన్నారు. చక్కెర కర్మాగారం విషయమై సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇఫ్కో కిసాన్‌సెజ్ వేలాది ఎకరాల భూమి అందుబాటులో ఉందని మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కంపెనీలు నెలకొల్పడం లేదన్నారు. ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో సదుపాయాలు కల్పిస్తే పరిశ్రమలు స్థాపించే అవకాశం ఉందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.

తప్పుడు ప్రచారం మానుకోవాలి

- పెన్నాడెల్టా మాజీ చైర్మన్ ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తనను పక్కన పెట్టిందని కొంతమంది స్వార్థపరులు లేనిపోని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ పెన్నా డెల్టా చైర్మన్ ఎర్రంరెడ్డి గోవర్ధన్ రెడ్డి వాపోయారు. గురువారం రేబాలలోని తన నివాసంలో స్థానిక నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల14న ఉండవల్లిలో ఎమ్మెల్యే పిలిచిన మేరకు వారి నివాసంలో తన సోదరుడితో కలిసి మండల కమిటీలు, గ్రామ కమిటీలు గురించి చర్చించామన్నారు. ఈ విషయంలో జరిగిన కొన్ని సంభాషలు కొన్ని పత్రికల్లో వక్రీకరించి రాయడం తగదన్నారు. నియోజకవర్గం నుంచి అసెంబ్లీలో గళం వినిపించిన ఎమ్మెల్యేలలో శ్రీనివాసులురెడ్డి తరువాత ఏకైక ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డే అన్నారు. సమావేశంలో సర్పంచు భాగ్యలక్ష్మి ఉన్నారు.

ప్రిన్సిపాల్ తప్పును కప్పిపుచ్చేందుకే సస్పెన్షన్

- పీఈటీ హేమలత ఆవేదన



తోటపల్లిగూడూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోడూరు గురుకుల ప్రిన్సిపాల్ ఎస్తేరమ్మ చేసిన తప్పులను కప్పిపుచ్చేందుకే తనను సస్పెండ్ చేశారని పీఈటీ హేమలత వాపోయారు. ఈ విషయంపై పాఠశాల ఎదుట గురువారం మీడియాతో మాట్లాడారు. సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రానికి విద్యార్థినులు హాజరుకావడంలో జరిగిన అలసత్వానికి ప్రిన్సిపాల్ కారణం అయితే ఆ నెపాన్ని తనపై నెట్టారని ఆరోపించారు. ఏ తప్పు చేయకపోయినా ఎలాంటి నోటీసు లేకుండా సస్పెండ్ చేయడంపై ఆవేదన వ్యక్తం చేశారు పాఠశాలలో తనతో పాటు పనిచేస్తున్న మరో పీఈటీ మౌనిక వ్యవహార శైలిని ప్రశ్నించినందుకు అదేవిధంగా ఆడుదాం ఆంధ్రలో క్రీడాకారులకు వచ్చిన నిధుల దుర్వినియోగంపై అభియోగాలు ఉన్నాయని, నిత్యావసర వస్తువులు బయటకు పంపడంలాంటి విషయాలు బయటకి వెళుతున్నాయని నెపంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తమపై ప్రిన్సిపాల్ బూతులు తిడుతూ ఆడబిడ్డ అని చూడకుండా సోమవారం అర్ధరాత్రి తనను బయటకు గెంటేసిందన్నారు. పది నెలల నుంచి తనకు జీతం రావాల్సి వుందని, ఉన్నతాధికారులు ఈ విషయంలో సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు. డీసీఓ పద్మజను వివరణ కోరగా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

చెరువుల ఆక్రమణలపై చర్య తీసుకోండి

మనుబోలు,మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, ప్రభుత్వ భూములను ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు డిమాండు చేశారు. ఈ విషయంపై ఆయన గురువారం పార్టీ నాయకులతో కలిసి స్థానిక రెవెన్యూ కార్యాలయంకు వెళ్లి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. బండేపల్లి, మడమనూరు, కుడితిపల్లి చెరువులతో పాటు పలు గ్రామాల్లోని చెరువులు ఆక్రమణకు గురి అయినట్లు చెప్పారు. గత 5ఏళ్లలో రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములను చేతులు మారినట్లు ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, నాయకులు జాకీర్, మహేష్, కంటే సుధాకర్, ఆనంద్, వాణిభవాని, మల్లి, శివ, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సురేష్‌నాయుడు, నాయకులు

C.R.I.M.E N.E.W.S

వరి కోత యంత్రం ఆపరేటర్ దుర్మరణం

- రోడ్డు దాటుతుండగా ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

మనుబోలు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు-మనుబోలు మార్గంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో హర్యానాకు చెందిన బల్వీందర్ సింగ్ (30)మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. వరికోత యంత్రాల ఆపరేటర్‌గా ఈ నెల2వ తేదీ ఈయన మండలానికి వచ్చాడు. అక్కం పేట, వీరంపల్లి పరిధిలో నడుస్తున్న వరికోత పనుల్లో పాల్గొంటున్నారు. పని ముగియగానే వీరంపల్లి సమీపంలోని పెట్రోల్‌బంకు వద్దకు వచ్చి అక్కడే నిద్రిస్తాడు. ఈ క్రమంలో రాత్రి 10గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా పొదలకూరు నుంచి మనుబోలు వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొని వెళ్లడంతో బల్వీందర్ సింగ్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గురువారం ఉదయం నిద్రలేచి బల్వీందర్ సింగ్ కనబడకపోవడంతో వెతుకులాడారు. రోడ్డు పక్కన పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ. శివరాకేష్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

నెల్లూరు(క్రైం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండు సమీపంలో గురువారం సాయంత్రం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు... 40నుంచి 45 వ్యక్తి మరణించాడు. మృతదేహంపై ఆకుపచ్చ హాఫ్ హ్యాండ్స్ టీ షర్ట్, బ్లూ రంగు షార్ట్ ఉన్నాయి. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ఫ్లాట్‌ఫారంపై మరొకరు..

నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో 4వ నెంబరు ప్లాట్‌ఫామ్‌పై గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతిచెందారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్‌ఐ జీ.మాలకొండయ్య ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 40ఏళ్ల వ్యక్తి మృతదేహంపై బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్స్ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయి. అనారోగ్యంతో మృతి చెంది ఉండొచ్చని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని..

మర్రిపాడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ కొడుకు తండ్రిని హతమార్చిన సంఘటన బుధవారం రాత్రి మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఎస్సీ కాలనీలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చుంచులూరు గ్రామానికి చెందిన చీలపోగు చిన్నయ్య (43) కుమారుడు శివకుమార్ మద్యానికి బానిసై నిత్యం తల్లిదండ్రులను డబ్బులు ఇవ్వమని హింసిస్తూ ఉండేవాడు. దీంతో తల్లి పెంచలమ్మ కొంతకాలంగా బుచ్చిలో తమ పెద్ద కుమార్తె వద్ద ఉంటోంది. తండ్రి చిన్నయ్య, శివకుమార్ ఇద్దరు మాత్రమే ఇంట్లో ఉండేవారు. ఈనేపథ్యంలో శివకుమార్ బుధవారం రాత్రి మద్యం తాగివచ్చి డబ్బుల కోసం చిన్నయ్యతో గొడవపడి తీవ్రంగా కొట్టాడు. ఇంటిలో నుంచి కేకలు వినిపిం చటంతో చుట్టుపక్కల వారు వచ్చేసరికి శివకుమార్ పరారయ్యాడు. చిన్నయ్య కిందపడి కొట్టుకుంటుండడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 108 వాహనం వచ్చేసరికే చిన్నయ్య మృతిచెందాడు. ఆత్మకూరు సీఐ గంగాధర్, మర్రిపాడు ఎస్‌ఐ శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా, పరారీలోని నిందితుడు శివకు మార్‌ని గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం.

కమ్మవారిపాలెంలో మహిళలపై దాడి

- ముగ్గురికి తీవ్రగాయాలు

జలదంకి, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారి పాలెంలో గురువారం మహిళలపై ఓ యువకుడి దాడిచేయగా, ముగ్గురు గాయపడ్డారు. గ్రామానికి చెందిన కరియావుల కుమార్ అదే గ్రామంలోని వరుసకు తోడికోడళ్లు అయిన పమిడి విజయమ్మ, రాములమ్మలతో పాటుగా రాములమ్మ కుమారుడు శివప్రసాద్‌లపై విచక్షణారహితంగా గొడ్డలితో దాడి చేశాడు. దాడిలో వారు తీవ్రంగా గాయపడ్డారు. దాడి సమయంలో బాధితులు పెద్దపెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల నివాసాల వారు వచ్చేలోపే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నారు.

అసభ్యకర వ్యాఖ్యలపై కేసు నమోదు

ఉదయగిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యుల పట్ల అసభ్యకరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి గురువారం తెలిపారు. పట్టణం మంగళగిరి కాలనీకి చెందిన గాజులపల్లి మధు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కుటుంబ సభ్యులను అసభ్యకర పదజాలంతో దూషిస్తూ అనుచిత వ్యాఖ్యలతో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిందితుడి అరెస్ట్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన వరికుంటపాడులో వృద్ధురాలిపై అత్యాచార యత్నానికి పాల్పడిన కేసుకు సంబంధించి గురువారం గొల్లపల్లి గురవయ్య అనే యువకుడిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రఘునాథ్ తెలిపారు. ఈనెల 16వ తేదీ రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిపై అదే గ్రామ యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడడంతో ఆమె కేకలు వేయడంతో అతను పరారయ్యాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు గాలింపు చర్యలు చేపట్టి అరెస్టు చేసిన యువకుడిని ఉదయగిరి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

రౌడీషీటర్ బైండోవర్

నెల్లూరు(క్రైం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని చిన్నబజారు స్టేషన్ పోలీసులు గురువారం ఓ రౌడీషీటర్‌ను బైండోవర్ చేశారు. పోలీసు ల సమాచారం మేరకు... గాంధీబొమ్మ సెంటర్‌లో ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ తనిఖీలు చేస్తుండగా ఖుద్దూస్ నగర్‌కు చెందిన రౌడీషీటర్ షేక్ జలీల్ అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతడిని ఎస్‌ఐ ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పాడు. ఎస్‌ఐ అతడిని స్టేషన్‌కు తరలించి బైండోవర్ చేశారు.

రేషన్ బియ్యం లారీ పట్టివేత

దగదర్తి /బిట్రగుంట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సున్నపుబట్టి జాతీయ రహదారిపై గురువారం రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తహసీల్దారు కృష్ణ తెలిపారు. అనుమానాస్పదంగా వస్తున్న లారీని ఆపి, లోడుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ఆర్ఐ, సిబ్బంది పరిశీలించారని తెలిపారు. డ్రైవర్‌ను ఆరా తీయగా గుడ్లూరు మండలం పెద్దపవని నుంచి చెన్నైలోని రెడ్‌హిల్స్‌కు వెళుతున్నట్లు తెలిసిందన్నారు. లారీలో 520బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించి, పోలీసులకు అప్పగించామని తెలిపారు. మార్కెట్ విలువను బట్టి బియ్యం విలువ రూ.13 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

పోలీసుల నిర్లక్ష్యం.. ప్రజల అవస్థలు

సంగం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుల నిర్లక్ష్యం కారణంగా కుళ్లి దుర్వాసన వస్తున్న చికెన్ వ్యర్థాలతో స్థానిక ప్రజలు అవస్థలకు గురయ్యారు. వివరాల మేరకు.. రెండు రోజుల కిందట స్థానిక పోలీసులు చికెన్ వ్యర్థాలను డ్రమ్ముల్లో తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. కేసు నమోదు చేశారు.ఆ వ్యర్థాలను గుంత తీసి పూడ్చకుండా కొండ ప్రాంతం వద్ద డ్రమ్ముల్లో ఉన్న చికెన్ వ్యర్థాలను గుట్టగా పోసి వదిలేశారు. దుర్వాసన భరించలేక ప్రజలు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో హల్‌చల్ చేశారు. స్పందించిన పోలీసులు ఎట్టకేలకు దుర్వాసన వెదజల్లుతున్న చికెన్ వ్యర్థాలను ఎక్స్‌కవేటర్‌తో గుంతలు తీసి పూడ్చి పెట్టారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	106
స్కిన్ చికెన్	196
స్కిన్‌లెస్	216

కోడిగుడ్ల ధర (100): 425



'కుష్ఠు'పై అపోహలు వీడాలి : న్యూక్లియర్ అధికారి సురేంద్రబాబు

నెల్లూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠు వ్యాధిపై ఇప్పటికీ గ్రామాల్లో అనేక అపోహలు, మూఢనమ్మకాలు ఉన్నాయని, వాటిని దూరం చేయాలని జిల్లా న్యూక్లియర్ అధికారి డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. గురువారం మండలంలోని దేవరపాళెం గ్రామంలో ప్రజలకు కుష్ఠు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమానం ఉన్న వెంటనే దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని సూచిం చారు. సకాలంలో వ్యాధిని కనుగొని చికిత్స చేస్తే నయమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సౌత్‌మోపూరు పీహెచ్‌సీ వైద్యుడు రవీంద్రనాథ్ రెడ్డి, స్థానిక సీహెచ్‌వో జ్యోతిర్మయి, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.

కనుపూరులో తవ్వేందెంత!?

- చెరువులో రూ.కోట్ల విలువైన మట్టి దోపిడీ
- వైసీపీ నేతలు, ఇరిగేషన్ అధికారుల కుమ్మక్కు
- నేడు విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశం
- రంగంలోకి దిగిన అధికారులు.. అక్రమాల గుర్తింపు

నెల్లూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం మండలం కనుపూరు చెరువును కుళ్లబొడిచి రూ.కోట్ల విలువైన మట్టిని అమ్ముకొని తిన్న భోక్తల బాగోతం బయటపడుతోంది. నాడు వైసీపీ నేతల అవినీతిలో భాగం పంచుకున్న ఇరిగేషన్ అధికారుల బండారం బట్టబయలు కాబోతోంది. గత ప్రభుత్వంలో ఓ వైపు రైతులు, మరోవైపు ప్రతిపక్ష పార్టీ నేతలు గగ్గోలు పెట్టినా, అఖ రుకు మట్టి తవ్వకాలను అడ్డుకున్నా దోపిడీ మాత్రం ఆగలేదు. ఈ దోపిడీపై ఇప్పుడు రైతుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు.. అవినీతి బాగోతా న్ని వెలుగు తీసే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఇరిగేషన్ నెల్లూరు సెంట్రల్ డివిజన్ నుంచి నాటి అనుమతి పత్రాలన్నిటినీ స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో ఎవరెవరు మట్టి కోసం అనుమతు లకు దర ఖాస్తు చేసు కున్నారు? అందుకు సంబంధించి చలానాలు ఎవరెవరు కట్టారు? ఎంత క్వాంటిటీకి అనుమతులిచ్చారు? ఈ మట్టిని ఎక్కడికి తరలించేందుకు అనుమతులు తీసుకున్నారు? అన్న వివరాల ను సేకరించారు. ఆ తర్వాత కనుపూరు చెరువును క్షేత్ర స్థాయిలో పరిశీలించిన విజిలెన్స్ అధికారులు.. చెరువులో నీరు ఉండడంతో ప్రత్యేక టెక్నాలజీ సాయంతో చెరువుల్లోని గుంతల లోతును లెక్కించినట్లు సమాచారం. ఇంత భారీ లోతుగా మట్టిని తవ్వి తరలించ డంపై విజిలెన్స్ అధికారులు కూడా నివ్వెర పోయినట్లు తెలిసింది. ఆ తదుపరి ఇక్కడి నుంచి మట్టిని ఎక్కడకు తరలించాలని దరఖాస్తు చేసుకున్నారు? అయితే వాస్తవా నికి ఎక్కడికి తరలించారు? అన్నదానిపై విచారణ జరపనున్నారు. విచారణ వేగంగా జరుగుతుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

రికార్డులు అప్పగించాం

కనుపూరు చెరువులో మట్టి తవ్వకాలకు ఇచ్చిన అనుమతి పత్రాలు, అందుకు సంబంధించిన ఇతర రికార్డులు ఇవ్వాలని విజిలెన్స్ అధికారులు కోరారు. వారు అడిగిన వివరాలన్నీ అందజేశాం.

\- కే నాగరాజు, ఇరిగేషన్ ఈఈ సెంట్రల్ డివిజన్

● రంగ.. రంగ.. రంగపతే..!

వైభవంగా త్యాగరాజ స్మరణోత్సవాలు

- మైమరపించిన మల్లాది సోదరుల సంగీత కచేరి



స్వర విన్యాసం చేస్తున్న మల్లాది సోదరులు

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పుర మందిరంలో జరుగుతున్న త్యాగరాజస్వామి స్వర్ణోత్సవాల్లో గురువారం రాత్రి విజయవాడకు చెందిన మల్లాది సోదరుల సంగీత కచేరీ శ్రోతలను మైమరపింపజేసింది. మల్లాది సోదరులు రామ్‌ప్రసాద్, రవికుమార్ శ్రీరంగనాథునిపై త్యాగరాజు రచించిన కృతిని ఆలపించి నెల్లూరు నగరం విశిష్టతను తెలిపారు. పలు త్యాగరాజ కృతులను గానం చేసి భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ సన్మానం అందుకున్నారు. ఉదయం భక్త ప్రహ్లాద హరికథను చింతా ఈశ్వర శర్మ భాగవతార్ గానం చేశారు. వేమూరి బాలకృష్ణ భాగవతార్ సతీ సక్కుబాయి, బోడిగ లక్ష్మీ నారాయణ భాగవతార్ సుందర కాండ హరికథా గానం చేశారు. సాయంత్రం రమ్య, రామకృష్ణ, అవినాష్, వినీష, శరద్‌చంద్రిక తదితర స్థానిక సంగీత కళాకారులు త్యాగరాజ కృతులను ఆలపించి ఆహూతుల ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా సీతారాములకు ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. యనమండ్ర నాగదేవీప్రసాద్, శ్రీరామమూర్తి, శ్రీరామచంద్రమూర్తి, శ్రీనివాసమూర్తి, చంద్రమౌళి, నాగేశ్వర్ తదితరులు పర్యవేక్షించారు.

న్యూస్ బాక్స్

'సునీతా విలియమ్స్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'

నెల్లూరు(విద్య), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భారత సంతతి శాస్త్రవేత్త, వ్యోమగామి సునీతా విలియమ్స్‌ను నేటితరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా పీహెచ్‌సీ అసోసియేషన్ అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అన్నారు. నగరంలోని కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో గురువారం సునీత విలియమ్స్ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిది రోజుల పర్యటనకోసం అంతరిక్షంలోకి వెళ్లి అనుకోని పరిస్థితుల్లో 9 నెలలు అక్కడే ఉండాల్సి వచ్చినా మానసిక ధైర్యాన్ని కోల్పోకుండా తిరిగి భూమికి చేరడం ఆమె గొప్పతనమన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్‌రావు, పీహెచ్‌సీ అసోసియేషన్ సభ్యులు బైరి శంకర్‌రావు, జయప్రకాష్, ఉపాధ్యాయులు హరీష్, సోమేశ్వరరావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(విద్య), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహించాలని ఆదేశాలిచ్చినా జిల్లాలో అనేక కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు పూర్తిస్థాయిలో తరగతులు నిర్వహిస్తున్నాయని, అటువంటి వాటిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వీ నరేంద్ర ఓ ప్రకటనలో కోరారు. అధిక ఎండల కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని, సంబంధిత అధికారులు వెంటనే తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కులు ఉల్లంఘిస్తు న్న వారిపై కఠిన చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని వన్‌ధన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు?

- లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 20 (ఆంధ్ర జ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వన్‌ధన్ వికాస్ కేంద్రాలు ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని ఏర్పాటు చేశారో తెలియచేయాలని లోక్‌సభలో గురువా రం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రశ్నిం చారు. ఇందుకు కేంద్ర గిరిజన వ్యవహా రాలశాఖ సహాయ మంత్రి దుర్గాదాస్ సమాధానం ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌లో 488 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

హైవేపై అండర్ బ్రిడ్జికి కేంద్రం సానుకూలం

- జడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), మార్చి 20 (ఆంధ్ర జ్యోతి) : నగరంలోని చింతారెడ్డి పాళెం జంక్షన్‌లో జాతీయ రహదారిపై అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై తిరుపతి ఎంపీ గురుమూర్తి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, 20 సూత్రాల అధ్యక్షుడు లంక దినకర్‌కు వినతి పత్రాలు అందజేశామని, వారంతా ఈ సమస్యను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి అండర్ బ్రిడ్జిని మంజూరు చేస్తామని చెప్పారన్నారు. ఇందుకు కృషి చేసిన నేతలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

రోగులను ఆదుకోవాలి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : రోగులు, అనాథలను ప్రతీ ఒక్కరు ఆదుకోవాలని మదీనా వాచ్ కంపెనీ యజమాని ఇంతియాజ్ పిలుపునిచ్చారు. గురువారం అబైండింగ్ హోప్ ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ప్రజల్లో ఎంతో మంది బలవర్ధక ఆహారం లేక అస్వస్థతకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి 300 మందికి చైర్మన్ నిర్మల్ కుమార్ ప్రతినెల పోషకాహారాన్ని అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జయప్రకాష్, టైటాన్స్ నిర్మల్ కుమార్, క్రాంతి, ఈగల్ సెల్ నుంచి ఫిరోజ్, మరియమ్మ, డేవిడ్ లివింగ్‌స్టన్, రూత్, బినోమి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

నెల్లూరు రూరల్, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి) : చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎక్కువ శాతం నిధులు కేటాయించడం జరుగుతుందని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 20 కుటుంబాలకు చెందిన వారికి రూ. 20 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను అందచేశారు. కూటమి ప్రభుత్వంలో నియోజకవర్గంలోనే రూ.70 లక్షల సహాయ నిధి అందచేసినట్లు చెప్పారు.

నిబంధనలకు అనుగుణంగానే ఇంటి ప్లాన్లు ఇవ్వండి

- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నుడా నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణాలకు ప్లాన్లు ఇవ్వాలని అధికారులను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదేశించారు. లైసెన్స్‌డ్ ఇంజనీర్లు, నుడా అధికారులతో ఆయన నుడా కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్లాన్లు మంజూరు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్లాన్లు ఇచ్చే సమయంలో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీవో హిమబిందు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ రోజే సదరం పరీక్షలు చేయాలి

- కలెక్టర్ ఆనంద్ ఆదేశం ● దివ్యాంగుల కేంద్రం ఆకస్మిక తనిఖీ



జీజీహెచ్‌లో సదరం క్యాంపును తనిఖీ చేసి అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (వైద్యం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు పేరు రిజిస్టర్ చేసుకున్న రోజే వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆనంద్ వైద్యాధికారులను ఆదేశించారు. నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగుల సదరం క్యాంపును గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ దివ్యాంగులకు అందుతున్న మౌలిక సదుపాయాలను, దివ్యాంగుల రిజిస్ట్రేషన్ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీరు, ఆహారం తదితర వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. దివ్యాంగులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియను వేగవతం చేయాలన్నారు. వినికిడి పరికరాలు అవసరమైన వారికి గొలగమూడి సీఆర్‌సీ సెంటర్ అనుసంధానంతో ఆ పరికరాలు అందించటం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర, డాక్టర్ మస్తాన్‌బాషా, డాక్టర్ గంగాధర్, డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్కులతో ఆహ్లాదం

అన్నింటినీ వినియోగంలోకి తేవాలి
నగర కమిషనర్ సూర్యతేజ



వెహికల్ షెడ్డులో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నగర వాసులు పార్కుల ద్వారా ఆహ్లాదకర వాతావరణం పొందుతారని నగర కమిషనర్ ఎం సూర్య తేజ అన్నారు. నగరంలో ఉన్న పార్కులన్నింటినీ వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు ఆహ్లాదాన్ని చేలా తయారు చేయాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని మూలపేట వద్దనున్న వాటర్ ట్యాంకు పార్కు, ఏఆర్పీ ఫంక్షన్ హాల్ వద్దనున్న ఖుద్దూస్‌నగర్ పార్కు, అమీన్ నగర్ పార్కు, మహబూబ్‌ఖాన్ పార్కు, కలెక్టరేట్ వద్దను న్న ఏపీజే అబ్దుల్‌కలాం పార్కు, గుప్తా పార్కును ఆయన పరిశీలించారు. పార్కులలో సౌకర్యాలన్నీ యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలన్నారు. అన్యాక్రాంతమవుతున్న పార్కు స్థలాలను స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం కుక్కలగుంట వద్దనున్న వెహికల్ షెడ్డులో వాహనాలను తనిఖీ చేశారు. డీజిల్ వినియోగంపై ఆరా తీసి రిజిస్టర్‌ను పరిశీలించారు. పాతమున్సిపల్ ఆఫీసు వద్దనున్న అన్న క్యాంటీన్‌ను సందర్శించి, అక్కడ అందిస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు.

పారిశుధ్య మెరుగునకు యంత్రాలు



నగర పాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ చైనత్య

నెల్లూరు(సిటీ), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య మెరుగునకు యంత్రాలను వినియోగిస్తున్నట్లు కార్పొరేషన్ ఆరోగ్య అధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. గురువారం ఎస్ఎంసీలోని ఆయన కార్యాలయంలో ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. దోమల నివారణకు క్షేత్ర స్థాయిలో ప్రస్తుతం జరుగుతున్న పనులకు అదనంగా కొత్త ఫాగింగ్ యంత్రాలు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. ప్రతీ డివిజన్‌కు ఒకటి చొప్పున 54 నూతన హ్యాండ్ ఫాగింగ్ యంత్రాలు రానున్నాయన్నారు. వీటితో పాటు ప్రస్తుతమున్న రెండు ఆటోల్లో తిరిగి ఫాగింగ్ యంత్రాలకుతోడు మరో నాలుగు కొత్తవి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. చిన్న చిన్న సందుల్లో చెత్తను సమీకరించేందుకు ఇప్పటికే 120 పుష్‌కాట్స్ వాటిల్లో బిన్లు అందించామని, మరో 120 త్వరలో వస్తాయని తెలిపారు. 1100 లీటర్ల సామర్థ్యం కలిగిన కంపాక్టర్ బిన్నులు 58 రాగా, మరో 58 త్వరలో వస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతమున్న 6 స్వీపింగ్ యంత్రాలతో రోడ్లను శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. టాటా ఏస్, ఇంట్రా వాహనాలు 50 ఉన్నాయని వాటితో పెద్ద వాహనాలు వెళ్లలేని వీధు ల్లోని చెత్తను సేకరిస్తున్నామని తెలిపారు. చెత్త కుండీలు లేని బ్లాక్ స్పాట్లలో తరుచూ ఎవరెవరు చెత్త రోడ్లపై వేస్తున్నారో తెలుసుకునేందుకు 70 సీసీ కెమెరాల ద్వారా నిత్యం కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ జరుగుతోందన్నారు. చెత్త వేసే వారిని గుర్తించి తొలుత హెచ్చరికలు, ఆపై జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు.

తలగాయాల చికిత్సలో తొలి గంట కీలకం

- 'అపోలో' వైద్యుడు శ్రీరామ్ సతీష్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామ్ సతీష్

నెల్లూరు (వైద్యం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : తలకు బలమైన గాయాలు అయినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమని, లేదంటే మెదడు కణాలు ప్రతి సెకనుకు లక్షలాదిగా చనిపోతూ ఉంటాయని అపోలో ఆసుపత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ వెల్లడించారు. ప్రపంచ తలగాయాల దినోత్సవం సందర్భంగా గురువారం ఆసుపత్రిలో నిర్వ హించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అపోలో ఆసుపత్రిలో ప్రపంచ స్థాయి వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలియ చేశారు. ప్రధానంగా రోడ్డు ప్రమా దాలు, భవనాల శిథిలాల కింద పడిపోవటం, ప్రమాదవశాత్తు తలకు బలమైన గాయమైతే మెదడుపై తీవ్ర ప్రభావం ఉంటుందని చెప్పారు. న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ వాడాలని, కారు పడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అపోలో ఆసుపత్రిలో సిస్టెర్నో స్టమీ అనే ఆధునాతన మెదడు శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ఉబేద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టిడ్కో చైర్మన్ పుట్టినరోజు



ప్రగతి చారిటీస్‌లో పిల్లల మధ్య కేక్ కట్‌చేస్తున్న జనసేన పార్టీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ నాయకుడు వేములపాటి అజయ్‌కుమార్ పుట్టినరోజును గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ ఆధ్వర్యంలో నగరంలోని జీజీహెచ్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ప్రగతి చారిటబుల్ ట్రస్ట్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు గునుకుల కిషోర్, చంద్రశేఖర్‌రెడ్డి, సుధా మాధవ్, కాకు మురళి, కరీం, మార్కెట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

- జనసైనికుడి బిడ్డకు ఫీజు చెల్లింపు

నగరంలో జనసేన క్రియాశీలక సభ్యుడు చెరుకూరు సుబ్బు అకాల మరణంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో చితికిపోయింది. ఈ క్రమంలో అజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా సుబ్బు పిల్లల చదువుకు సంబంధించిన ఫీజులను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆధ్వర్యంలో చెల్లించి మానవత్వం చాటుకున్నారు.

- 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు

జనసేన పార్టీ రూరల్ సమన్వయకర్త కాకు మురళిరెడ్డి ఆధ్వర్యంలో వీఆర్సీ దగ్గరున్న వినాయకుడి ఆలయంలో 101 టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పన్నుల బలవంతపు వసూళ్లు ఆపాలి

- లేదంటే కార్పొరేషన్ కార్యాలయం ముట్టడి : సీపీఎం



సచివాలయం వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పన్నులు, కొళాయి పన్నుల బలవంతపు వసూళ్లను వెంటనే ఆపాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం పన్నుల వసూళ్లపై ప్రజలతో కలిసి 54 డివిజన్ భగత్ సింగ్ కాలనీ మూడు జెండాల సెంటర్ సచివాలయం వద్ద నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు పన్నుల పేరుతో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని, వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. జలజీవన్ మిషన్ పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా మంచినీరు సరఫరా చేస్తామని ప్రధాని మోదీ చెబుతుండగా నగరంలో వేల రూపాయలు కొళాయిలకు పన్ను విధిస్తున్నారని ఆరోపించారు. ఇంటి పన్నులపై విధించిన అధిక వడ్డీని తక్షణమే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పన్నుల వసూళ్ల కోసం వేధింపులకు పాల్పడితే కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ వాడకం నిషేధంపై ఆర్టీసీ బస్టాండులో అవగాహన



కార్పొరేషన్ సెక్రటరీలను సత్కరించి మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆర్టీసీ ప్రధాన బస్టాండులో ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకం నిషేధంపై దుకాణాల యజమానులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్లాసిక్ వాడటం వల్ల పశుపక్ష్యాదుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. క్యాన్సర్ వ్యాధులు రావడానికి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. స్టాల్స్ యజమానులు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని ఆదేశించారు. అనంతరం కార్పొరేషన్ సెక్రటరీలు హీనా, ప్రవీణ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు, విజిలెన్స్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 21 మార్చి 2025





తిరుపతి ఇందిరా మైదానంలో మెగా హెల్త్ మీట్

ఉచితంగా వైద్యపరీక్షలు, మందుల అందజేత

రేపు, ఎల్లుండి

'ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతి'

తిరుపతి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో బాధ పడుతూ ఏ డాక్టర్‌ను కలవాలో తెలియక సతమతవుతున్న వైద్యార్థులకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' అరుదైన వేదికను ఏర్పాటుచేస్తోంది. శని, ఆదివారాల్లో తిరుపతి నగరం తుడా కార్యాలయం సమీపంలోని ఇందిరా మైదానంలో 'వైద్య జ్యోతి' పేరిట ప్రత్యేక ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో తిరుపతిలోని ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో ఉచిత హెల్త్ మీట్ ఉంటుంది. రెండు రోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే వైద్యజ్యోతిలో రోగులను పరీక్షించి అవసరమైన ప్రాథమిక వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారు. కొన్నిరకాల మందులను కూడా ఉచితంగా అందించనున్నారు. వెంకటరమణ గుండె, మెటర్నిటీ హాస్పిటల్, మనోహరి రామచంద్ర హాస్పిటల్, ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్, అంకుర హాస్పిటల్, డీఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, యష్ హాస్పిటల్స్, శ్రీసాయి సుధా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డీబీఆర్ అండ్ ఎస్కే క్యాన్సర్ సెంటర్, కాకర్ల డెంటల్ హాస్పిటల్, కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్, మెడిగో హాస్పిటల్స్, సన్‌ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యులు, వైద్య సిబ్బంది వైద్యజ్యోతి హెల్త్ మీట్‌లో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (ఎన్‌బీకే) ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పి.మనోహర్‌రెడ్డి, కేపీ చౌదరి ప్రధాన స్పాన్సర్‌గాను.. సీపీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు కో స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నారు. వైద్యజ్యోతి శిబిరంలో ప్రజలు పాల్గొని ఆరోగ్య సమస్యలకు ఉచితంగా పరిష్కారం పొందవచ్చు. ఈ కార్యక్రమం తర్వాత కూడా సంబంధిత ఆస్పత్రులలో ప్రత్యేక రాయితీలతో వైద్య సదుపాయం పొందే అవకాశం ఉంది.



అధ్యక్షా..



భూ సమస్యలను పరిష్కరించాలి

మా నియోజకవర్గంలో పట్టాలు పొంది రైతులు సేద్యం చేసుకుంటున్నారు. ఇప్పుడా భూములను రిజర్వ్ ఫారెస్ట్ అధికారులు తమవంటూ లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా కేవీబీపురం మండలం కళత్తూరు, వేములపాడు, వగత్తూరుతో పాటు పలుచోట్ల ఈ సమస్యలు ఉన్నాయి. వీటిని పరిష్కరించాలి. బీఆర్ అంబేడ్కర్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి.

- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే



'వర్గీకరణ'పై రాద్ధాంతం వద్దు

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా సీఎం చంద్రబాబు చరిత్రలో గుర్తుండిపోతారు. దీనిపై కొందరు రాద్ధాంతం చేయడం మంచిపద్ధతి కాదు. వర్గీకరణ గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత మనపైనే ఉంది.

- పాశం సునీల్‌కుమార్, ఎమ్మెల్యే

కృత్రిమ మేధతో అనుసంధానం చేయాలి



శేముషి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చాన్సలర్ గోపాలస్వామి, వీసీ కృష్ణమూర్తి తదితరులు


జాతీయ సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవంలో చాన్సలర్ గోపాలస్వామి

42 మందికి బంగారు పతకాలు, 75 పీహెచ్‌డీలు, 564 మందికి డిగ్రీలు ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి వంటి గొప్ప కేంద్రంలో సంస్కృత విశ్వవిద్యాలయం దినదినాభివృద్ధిని పొందడం సంతోషకరం. ఇప్పటికే జరిగిన ప్రగతితో పాటు భవిష్యత్తు ప్రణాళిక కూడా అత్యంత పటిష్టంగా కలిగి ఉంది. భవిష్యత్తులో కృత్రిమ మేధతో అనుసంధానం చేయాల్సిన అవసరముంది. తద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చు' అని భారత మాజీ ఎన్నికల ప్రధానాధికారి గోపాలస్వామి పేర్కొన్నారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గురువారం జరిగిన 4వ స్నాతకోత్సవంలో ఆయన చాన్సలర్ హోదాలో ప్రసంగించారు. స్నాతకోత్తర పట్టాలు అందుకున్న విద్యార్థులను అభినందించారు. సంప్రదాయ, ఆధునిక శాస్త్రాల మేళవింపుగా సంస్కృత వర్సిటీ పని చేస్తోందన్నారు. చిన్నారులకు సంస్కృత భాషను నేర్పేందుకు బాల కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. సంస్కృతంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. వర్సిటీ మాజీ ఛాన్స్‌లర్ డాక్టర్ వీఆర్ పంచముఖి వర్చువల్‌గా మాట్లాడారు. గొప్ప విద్యాకేంద్రమైన సంస్కృత వర్సిటీకి తాను చాన్సలర్‌గా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. సంస్కృత అధ్యయనాలు, సంప్రదాయ శాస్త్రాల బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో వర్సిటీ కృషి చేస్తున్నట్లు వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి వివరించారు. కాలానుగుణంగా అనేక కొత్త కోర్సులు, కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాక్‌శాస్త్రిలో లక్ష్మీప్రసన్న, డిగ్రీలో వై.జానకి, పీజీలో అమిత విక్రమ్ ఓవెరాల్ టాపర్లుగా నిలిచి బంగారు పతకాలను సాధించారు. వీరితో పాటు వివిధ విభాగాల్లో కోర్సులు పూర్తి చేసుకున్న 564 మంది విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలను.. 42 మంది బంగారు పతకాలు, 75 మందికి పీహెచ్‌డీలను అందజేశారు. త్రివేండ్రంకు చెందిన షాజీస్ మహమ్మద్ తాజుద్దీన్ ముస్లిం కుటుంబంలో పుట్టినా, వైదిక శాస్త్ర విద్యలో ప్రావీణ్యాన్ని సాధించడంపై పలువురు అభినందించారు. ఈయన పీహెచ్‌డీ పట్టా స్వీకరించారు.

పలు పుస్తకాల ఆవిష్కరణ

రామానుజ ప్రాజెక్టులో భాగంగా సురపురం శ్రీనివాసాచార్య రాసిన 'సిద్ధాంత చింతామణి' పుస్తకాన్ని ప్రొఫెసర్ కేఈ దేవనాథన్.. పరిశోధన-ప్రచురణల విభాగం రూపొందించిన 'మహస్విని' పత్రికను ప్రొఫెసర్ శివరామభట్ ఆవిష్కరించారు. యూనివర్సిటీ న్యూస్ లెటర్ 'శేముషీ' ని డాక్టర్ సోమనాథదాస్ ఆవిష్కరించారు.



రేణిగుంట విమానాశ్రయంలో వినతులను స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు



తిరుమలలో నారా భువనేశ్వరికి స్వాగతం పలుకుతున్న టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమలకు సీఎం చంద్రబాబు

శ్రీవారి దర్శనార్థం సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా గురువారం రాత్రి 11.30 గంటలకు తిరుమల చేరుకున్నారు. సాయంత్రమే నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, దేవాన్ష్ తిరుమలకు రాగా.. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ రాత్రి వచ్చారు. విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, సుధీర్‌రెడ్డి, జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయం వద్ద వేచి ఉన్న జనం నుంచి సీఎం చంద్రబాబు వినతిపత్రాలు స్వీకరించి తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పద్మావతి పార్కును హోల్డింగ్ పాయింట్‌గా నిర్ణయించలేదు



విచారణ అనంతరం తిరిగి వెళుతున్న పూర్వ ఎస్పీ సుబ్బరాయుడు

- భక్తులు కాకతాళీయంగా వెళ్లారు
- దురదృష్టవశాత్తు ఘటన జరిగింది
- ఏకసభ్య కమిషన్ విచారణలో పూర్వపు ఎస్పీ సుబ్బరాయుడు
- 'తొక్కిసలాట' ఘటనపై నేడూ కొనసాగనున్న విచారణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో 'తొక్కిసలాట' ఘటనపై గురువారమూ ఏకసభ్య న్యాయవిచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణమూర్తి విచారణ కొనసాగించారు. అప్పటి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు నాటి సంఘటనపై వాంగ్మూలం ఇచ్చారు. 'వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీకి తిరుపతి నగరంలో పలుచోట్ల కేంద్రాలను టీటీడీ ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా బైరాగిపట్టెడలో రామానాయుడు జడ్పీ ఉన్నత పాఠశాలలో కౌంటర్లను ఏర్పాటు చేశాం. భక్తులు కాకతాళీయంగా పద్మావతి పార్కులోకి విశ్రాంతి కోసం వెళ్లారు. దీనిని మేము హోల్డింగ్ పాయింట్‌గా ఏర్పాటు చేయలేదు' అని కమిషన్‌కు, క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన న్యాయవాదులకు నాటి ఎస్పీ సుబ్బరాయుడు చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. దురదృష్టవశాత్తు సంఘటన జరిగిందని, సకాలంలోనే బాధితులను ఆస్పత్రికి తరలించి వైద్యం అందించామని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. సంఘటన సమయంలో తాను వేరే ప్రాంతంలో బందోబస్తు పర్యవేక్షిస్తున్నానని, ఎస్పీగా పర్యవేక్షణ బాధ్యత తనదేనని, కానీ, పార్కు గేటుకు తాళాలు వేసిన నిర్ణయం తనది కాదని చెప్పినట్లు తెలిసింది. కింది స్థాయి ఉద్యోగులు నిర్ణయం తీసుకుని ఉండవచ్చన్నారు. ఈ ఘటనలో సస్పెండైన డీఎస్పీ రమణకుమార్ తరపున లాయర్లు పూర్వపు ఎస్పీ సుబ్బరాయుడిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసినట్లు సమాచారం. ఇక తొక్కిసలాట ఘటనలో గాయపడిన అన్నమయ్య జిల్లా రామసముద్రంకు చెందిన ముగ్గురు, వైజాగ్‌కు చెందిన ఒక బాధితుడు కమిషన్ ఎదుట వాంగ్మూలం ఇచ్చారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితులను, నాటి ఎస్పీ సుబ్బరాయుడిని జస్టిస్ సత్యనారాయణమూర్తి విచారించారు. కాగా, అధికారులతో పాటు ఆనాడు పార్కు వద్ద విధుల్లో ఉన్న వారు పెద్దసంఖ్యలో విచారణకు వచ్చారు. ఇక, అప్పటి టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌ను శుక్రవారం ఏకసభ్య కమిషన్ విచారించనుంది.

పీఎం యోగా అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి యోగా అవార్డు 2025 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఉత్తమ ప్రతిభ కనబరిచిన, యోగాను ప్రోత్సహించిన, సమాజంపై గణనీయ ప్రభావాన్ని చూపిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి వ్యక్తులు, సంస్థలు పీఎం యోగా అవార్డుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 0877-2286921, 9440573537, 7036428726లను సంప్రదించాలని కోరారు.

ఫార్మసీ ఆఫీసర్ ఉద్యోగ నియామకాలు తాత్కాలిక వాయిదా

తిరుపతి(వైద్యం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): కడప జోనల్ పరిధిలో ఇటీవల విడుదల చేసిన ఫార్మసీ ఆఫీసర్ పోస్టుల నియామకాలను హైకోర్టు ఉత్తర్వుల మేరకు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆర్డీ రామగిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఫార్మసీ ఉద్యోగాలకు సంబంధించి జనవరి 3న వచ్చిన నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు రావడంతో తాత్కాలికంగా వాయిదా వేయాలని కోర్టు ఆదేశించిందని పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

స్విమ్స్‌లో పలు కోర్సులకు ఏపీ.ఈఏపీసెట్ ర్యాంకుల ఆధారంగా అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో బీఎస్సీ(నర్సింగ్) బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ, బీఎస్సీ అలైడ్ హెల్త్‌సైన్సెస్(పారా మెడికల్) కోర్సుల్లో 2025-26 సంవత్సరానికి ఏపీ.ఈఏపీసెట్ ఆధారంగా మాత్రమే భర్తీ చేయనున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పై కోర్సులకు ప్రవేశం పొందాలంటే కచ్చితంగా ఏపీ.ఈఏపీసెట్-2025 అర్హత పొంది ఉండాలని పేర్కొన్నారు. ఏపీఈఏపీసెట్ ఫలితాలు ప్రకటించిన తర్వాత ఏపీ ఆన్‌లైన్, స్విమ్స్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని వివరించారు.

27న స్థానిక సంస్థల ఉప ఎన్నికలు

- ఒక ఎంపీపీ, నాలుగు ఉప సర్పంచి స్థానాలకు..

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ కారణాలతో స్థానిక సంస్థల్లో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు పరోక్ష విధానంలో ఉప ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 27న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు నామినేషన్ల స్వీకరణతో మొదలై మధ్యాహ్నం ఒంటి గంటతో ప్రమాణస్వీకారంతో ముగియనుంది. వీటిలో తిరుపతి రూరల్ ఎంపీపీ పదవితో పాటు రేణిగుంట మండలం గురవరాజుపల్లి, చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లి, కోట మండలంలోని ఎన్‌పీ కొత్తపాళెం, ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీల్లో ఉప సర్పంచికి ఎన్నికలు జరగనున్నాయి. కాగా, తిరుపతి రూరల్ ఎంపీపీగా వ్యవహరించిన మోహిత్‌రెడ్డి గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి రాజీనామా చేశారు. ఇన్ని రోజులు తిరుచానూరు ఎంపీటీసీ యశోద ఇన్‌ఛార్జి ఎంపీపీగా వ్యవహరించారు. ఈ నెల 27న ఎన్నికల నేపథ్యంలో 30 మంది ఎంపీటీసీలను ముంబయిలోని ఓ రిసార్టుకు తరలించినట్లు తెలిసింది.

జిల్లా పరిశ్రమల అధికారిగా సుధాకర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిశ్రమల శాఖ అధికారిగా కేపీ సుధాకర్ గురువారం ఆ శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



నడకదారిలో పాము

అలిపిరి కాలినడక మార్గంలో గురువారం ఎనిమిది అడుగుల జెర్రిపోతు పాము పట్టుబడింది. గాలిగోపురం వద్ద నున్న ఓ దుకాణంలోకి ప్రవేశించిన పామును భాస్కర్ నాయుడు బంధించి అడవిలో వదిలారు. అలాగే తిరుమలలోని మేదరమిట్ట ప్రాంతంలోని బరోడా బ్యాంక్‌పై భాగంలో ఉన్న హెల్త్ కార్యాలయంలో కూడా జెర్రిపోతును భాస్కర్‌నాయుడు పట్టుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నడక మార్గంలో, మేదరమిట్ట వద్ద పాములను పట్టుకున్న భాస్కర్ నాయుడు

ఎర్రచందనం నిందితుడికి ఏడాది జైలు

రూ.10వేల జరిమానా

తిరుపతి(నేరవిభాగం),మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ స్పెషల్ కోర్టు గురువారం తీర్పునిచ్చింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు తెలిపిన ప్రకారం.. శ్రీకాళహస్తి పరిధిలోని మేళ్ల చెరువుకు చెందిన మంగళంపేట చిన్నబాబు, యల్లంపల్లి జయరామయ్య, మేకల నరసింహులు, చెంగ్రాయులు, పి.గంగయ్య 2016లో మేళ్లచెరువు కట్ట నుంచి ఎర్రచందనం తరలిస్తూ పోలీసుల కంటబడ్డారు. చిన్నబాబు, జయరామయ్య దొరకగా మిగిలిన ముగ్గురు పారిపోయారు. కేసు నమోదు చేసి, ఇద్దరిని అరెస్టు చేశారు. సీఐ శ్రీనివాసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు కేసు విచారణ కొనసాగింది. వాదనలు విన్న కోర్టు రెండో నిందితుడు ఎల్లంపల్లి జయరామయ్యపై సాక్ష్యాధారాలు రుజువు కావడంతో ఏడాది పాటు కఠిన కారాగార శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చింది. ఒకవేళ జరిమానా చెల్లించకుంటే మరో మూడు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది.

వెటర్నరీ విద్యార్థుల సమ్మె విరమణ

తిరుపతిరూరల్, మార్చి20(ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు 45 రోజుల పాటు నిర్వహించిన నిరవధిక సమ్మెను గురువారం మధ్యాహ్నం విరమించారు. స్టైఫండ్‌ని పెంచుతూ రెండ్రోజుల క్రితం ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో సమ్మె విరమించారు. వెటర్నరీ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జగపతిరామయ్య వర్సిటీ ప్రధాన గేటు ఎదుట ఏర్పాటు చేసిన దీక్షా శిబిరం వద్దకు చేరుకుని విద్యార్థులకు నిమ్మరసాన్ని అందించి సమ్మెను విరమింపజేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి విద్యార్థులు పాలాభిషేకం చేశారు. వైద్య విద్యార్థుల మాదిరిగా తమకూ స్టైఫండ్ పెంచాలని కోరామని, స్పందించిన ప్రభుత్వం ప్రస్తుతం 50శాతం వరకు అదనంగా పెంచిందని విద్యార్థులు తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవికుమార్‌లను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.



సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

కూర్చునే స్థలం కోసం.. కొట్టుకున్నారు



గాయపడిన హంపయ్య, గోవిందరాజు

తిరుమల సీఆర్వో వద్ద గదుల కోసం వేచివున్న భక్తులు కొట్టుకున్నారు. కూర్చునే స్థలం విషయంలో కర్నాటక, తమిళనాడుకు లకు చెందిన రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తమిళనాడులోని కోయంబత్తురుకు చెందిన కార్తీకేయ గాజు బాటిల్‌తో దాడి చేయడంతో కర్ణాటక లోని బళ్లారికి చెందిన గోవిందరాజు, హంపయ్య గాయపడ్డారు. వీరిని స్థానిక అశ్విని ఆస్పత్రికి తరలించి వైద్యం చేశారు. ఆ తర్వాత ఆ రెండు కుటుంబాలు రాజీపడినట్టు తెలిసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో మనో

సినీగాయకుడు మనో గురువారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ఎన్నిసార్లు చూసిన స్వామివారి రూపాన్ని మర్చిపోతుంటాం. భక్తులను మళ్లీ మళ్లీ రప్పించుకునే గొప్ప క్షేత్రం తిరుమల' అని అన్నారు. త్వరలో ఉగాది రానుందంటూ, ఈ నూతన తెలుగు సంవత్సరాదిలో కళాకారులందరి కష్టాలు తొలగిపోయి అద్భుత విజయాలు సాధించాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఏటీసీ దాకా క్యూలైన్


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.3.97 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,388
తలనీలాలు సమర్పించినవారు: 26,145



నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

అరణ్య రోదన





పర్యావరణ సమతుల్యానికి దోహదపడే అడవులు రాన్రానూ చిక్కిపోతున్నాయి. దురాక్రమణదారుల బారిన పడి తరిగిపోతున్నాయి. జీవవైవిధ్యానికి బాటలు వేసే వనాలు అంతరించిపోతున్నాయి. జనం చొచ్చుకు వస్తుంటే ఉండటానికి చోటు లేక జంతువులు జనారణ్యం బాటపడుతున్నాయి. కాలక్రమేణా అటవీ విస్తీర్ణం కుచించుకుపోవడంతో పర్యావరణానికి దుష్ఫలితాలు ఎదురవుతున్నాయి. ఇది భవిష్యత్‌లో మరింత ప్రాణ సంకటంగా మారుతుందని పర్యావరణ హితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- మంగళం,ఆంధ్రజ్యోతి

- అంతరించిపోతున్న అడవులు
- పర్యావరణానికి పెను ప్రమాదం
- జనావాసంలోకి వన్యప్రాణులు





అటవీ విస్తీర్ణం ఏటేటా తగ్గిపోతోంది. అటవీశాఖ తాజా విడుదల చేసిన నివేదిక ప్రకారం జిల్లాలో 8,692.82 చదరపు కిలోమీటర్ల అటవీప్రాంతం ఉంది. ఇందులో దట్టమైనది 6.38 చదరపు కిలోమీటర్లు మాత్రమే. మధ్యస్థ దట్టమైన అడవి 888.26 చదరపు కిలోమీటర్లు. బహిరంగ అడవి 1,209.39 చదరపు కిలోమీటర్లు ఉంది. మిగిలిన అటవీప్రాంతం వివిధ సార్థ ప్రయోజనాలతో తరిగిపోతోంది.

వన్యప్రాణులు జనావాసాల బాట

జిల్లా పరిధిలో శేషాచల కొండలు, వెలిగొండ అడవులు జీవవైవిధ్యానికి నిలయాలు. ఈ అడవుల్లో చిరుతలు, ఏనుగులు, ఎలుగుబండ్లు, దుప్పులు, అడవి కుక్కలు, అడవి పందులు, జాకల్స్, హనీ బ్యాగ్జర్, చుక్కల దుప్పులు, జింకలు, అరుదైన బంగారుబల్లి, పునుగుపిల్లి, దేవాంగపల్లి వంటి వన్యప్రాణులు ఆవాసముంటున్నాయి. అరుదైన ఎర్రచందనం, పెర్రిత, సాంబ్రాణి వంటి చెట్లతో పాటు మోగీ, కరక, నారేపి వృక్షాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. పక్షులు సీతాకోక చిలుకలు, పాములు, ఇతర కీటకాలు అడవినీడన నిశ్చింతగా బతుకుతున్నాయి. అడవులు కాస్తా క్రమేపి తరిగిపోవడంతో వన్యప్రాణులు గత్యంతరం లేక ఆహారం, నీటి కోసం జనావాసాల్లోకి రాకతప్పడంలేదు. .



ప్రకృతి సమతుల్యానికి భంగం

అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం పెనుప్రమాదంగా తయారవుతోంది. సమతుల్యత దెబ్బతిని పర్యావరణానికే ముప్పుగా పరిణమిస్తోంది. వృక్షాల సంఖ్య తగ్గి అడవి చిన్నబోతుండటంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే జనం అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారంటే అడవుల ప్రభావమే.ప్రకృతి సమతుల్యానికి విఘాతమేర్పడి వర్షాలూ తగ్గిపోతున్నాయని పర్యావరణ నిపుణులు ఆవేద న చెందుతున్నారు. అడవుల సంరక్షణ తక్షణ పరిష్కా రమని వీరంతా తలపోస్తున్నారు.

అభివృద్ధి పేరిట వేటు

తమ అవసరాల కోసం జనం అడవులను ఆక్రమించడం పరిపాటిగా మారింది. రోడ్లు, భవన నిర్మాణాలు, డ్యాములు, గనుల తవ్వకాల కోసమే కాదు అవసరమైన కలప కోసం అడవులపై గొడ్డలి వేటు పడుతోంది. ఈ పరిణామమే ఇపుడు మానవ మనుగడకు సవాలుగా మారింది. శేషాచల కొండల్లో శ్రీగంధం, ఎర్రచందనం వృక్షాలను అడ్డు ఆపులేకుండా నరికేస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. తిరుమల కొండల్లోని శ్రీగంధం వృక్షాలు కనుమరుగయ్యాయి. ఆ జాబితాలోకి ఎర్రచందనంతో పాటు అరుదైన జంతువులు చేరిపోనున్నాయి. ఇప్పటికైనా అడవులు అంతరించి పోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

హతుడు ఎవరు?

- తిరుచానూరు పరిధిలో మృతదేహం
- ఆనవాళ్లు గుర్తుపట్టకుండా యాసిడ్ పోసి కాల్చిన దుండగులు
- స్టేషన్ల వారీగా మిస్సింగ్ కేసులపై పోలీసుల ఆరా



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆనవాళ్లు గుర్తుపట్టకుండా యాసిడ్ పోసి కాల్చారు. ఇలా గుర్తు పట్టని స్థితిలో 30-35 ఏళ్ల వ్యక్తి మృతదేహం తిరుచానూరు పరిధిలోని 150 అడుగుల బైపాస్ రోడ్డు సమీపంలో పడుంది. ఇతడు ఏ ప్రాంతం వాడో తెలియని పరిస్థితి. ఎక్కడో హతమార్చి.. ఇక్కడ పడేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తెలిపిన ప్రకారం.. పూతలపట్టు-నాయుడుపేట బైపాస్ రోడ్డు సమీపంలో మృతదేహం ఉన్నట్లు గురువారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించి సీఐకి సమాచారం ఇచ్చారు. మరోవైపు ఎస్పీ హర్షవర్ధనరాజు, పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చామన ఛాయ కలిగిన ఆ వ్యక్తి ఎత్తు సుమారు ఐదు అడుగులు ఉండొచ్చు. ఎలిఫెంట్ కలర్ ప్యాంటు, మిల్క్ కలర్ వైట్ పైన పూలగుర్తులున్న చొక్కా ఉంది. బుధవారం అర్ధరాత్రిపైన ఇక్కడ మృతదేహాన్ని పడేసి ఉంటారని అంచనా. హతుడు ఎవరనే కోణంలో విచారిస్తున్నారు. దీనికిగాను మృతుడి ఫొటోలను అన్ని సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. అన్ని పోలీసు స్టేషన్లకు పంపారు. ఈ మిస్టరీ హత్యను ఛేదించి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. దీంతో పోలీసులు భిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జరిగిన ఘటనపై స్థానికంగా అందుబాటులో వున్న సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణులైన పోలీసు బృందాలను నియమించారు. ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి. హత్యపై సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి కీలకమైన సీసీ టీవీ ఫుటేజీ లభ్యమైనట్లు సమాచారం.

కూలీలను ఢీకొన్న కారు

- వృద్ధురాలి మృతి.. నలుగురికి గాయాలు



లారీని ఢీకొన్న కారు - ప్రమాదంలో మృతి చెందిన పడ్డాల రత్నమ్మ

వెంకటగిరిటౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వర్ధనపల్లి గ్రామంలో వ్యవసాయ కూలీలను కారు ఢీకొన్న సంఘటన గురువారం చోటుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, నలుగురికి గాయాలయ్యాయని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. వెంకటగిరి - గూడూరురోడ్డులో వర్ధనపల్లి వద్ద పడ్డాల రత్నమ్మ (60), ఆమె కుమారుడు వెంకటకృష్ణయ్య, అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు ధాన్యం కాటా వేసి లారీలోకి ఎక్కిస్తున్నారు. ఇదే సమయంలో నెల్లూరుకు చెందిన శివకుమార్,చిగి కళ్యాణ్‌రెడ్డి వారాంతపు తండల్ వసూలు కోసం కారులో వెంకటగిరికి వస్తుండగా, కారు అదుపుతప్పి కాటా వేస్తున్న కూలీలపైకి దూసుకెళ్లి ముందు ఉన్న ధాన్యం లోడ్ లారీని వెనుకవైపున ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాటా వేస్తున్న పడ్డాల రత్నమ్మ, వెంకటకృష్ణయ్య, వెంకటేశ్వర్లుతో పాటు కారులో ఉన్న శివకుమార్, కళ్యాణ్‌రెడ్డి గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ పడ్డాల రత్నమ్మ మృతి చెందింది. వెంకటకృష్ణయ్య,వెంకటేశ్వర్లుకు స్వల్పగాయాలు కావడంతో ప్రథమ చికిత్స చేశారు.శివకుమార్, కళ్యాణ్‌రెడ్డిని నెల్లూరులోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.



తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో గురువారం జరిగిన స్నాతకోత్సవంలో చాన్సలర్ గోపాలస్వామి, వీసీ కృష్ణమూర్తి నుంచి బంగారు పతకాలు అందుకుంటున్న విద్యార్థులు





పీహెచ్‌డీ పట్టాదారులు

విద్యుదాఘాతంతో రైతు మృతి



గంగయ్య (ఫైల్ ఫొటో)

కేవీబీపురం, మార్చి 20(ఆంధ్ర జ్యోతి): మండలంలోని దిగువ పూడి గ్రామానికి చెందిన గంగయ్య(44) బుధవారం రాత్రి విద్యుదాఘాతంతో తన పొలంలోనే మరణించాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు ..గంగయ్య బుధవారం రాత్రి 10గంటల సమయంలో ఇంటి వద్ద భోజనం చేసి తమ పొలంలో సాగుచేసిన శెనగ, పుచ్చ పంటలకు కావలి కాయడానికి వెళ్లాడు. కొన్ని రోజులుగా పందుల బెడద ఎక్కువగా ఉండటంతో పొలం చుట్టూ విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్ ఇస్తుండగా వైరు జారి కాలి పడింది. దీంతో షాక్‌కు గురై స్పృహ కోల్పోయాడు. పక్క పొలంలో తన సొంత అల్లుడు, అన్న కుమారుడు కావలి ఉన్నారు. గంగయ్య కేకలు విని వారు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి భార్య దేశమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేశారు. కాగా గంగయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

సూళ్లూరుపేట,మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు గ్రామానికి చెందిన కొమరం నారాయణస్వామి ఇంటిపైకెళ్లి దూషించిన కేసులో ఐదుగురిపై గురువారం సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేశారు.బాధితుడి ఫిర్యాదు మేరకు అక్కరపాక మణికంఠ, పాలూరు రవి, లీలా మోహన్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు క్రీడాదుస్తుల పంపిణీ



విద్యార్థినులకు క్రీడాదుస్తులు అందజేస్తున్న డిప్యూటీ ఈవో సనత్‌కుమార్

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు స్థానిక డిప్యూటీ ఈవో కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఈవో సనత్‌కుమార్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మాండలేస్ కంపెనీ సహకారంతో మ్యాజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లోని పలు పాఠశాలలకు చెందిన 34 మంది విద్యార్థులు జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వీరిని మాండలేస్ కంపెనీ ఆధ్వర్యంలో హిమాచల్ ప్రదేశ్‌లో ఈనెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరగనున్న పోటీలలో ఆడించేందుకు తీసుకువెళుతున్నారన్నారు. విద్యార్థులు ఈ పోటీల్లో ప్రతిభచాటి పాఠశాలలకు మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో వెంకటసుబ్బయ్య, సంస్థ ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిలివేటి కంటికి అభివృద్ధి కనబడటం లేదా..?

● మాజీ ఎంపీ నెలవల, మాజీ మంత్రి పరసా విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, పరసా రత్నం, పక్కనే టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, పెరుమాల్, రమేష్ తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కంటికి కనబడటం లేదా అంటూ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నెలవలతో పాటు మాజీ మంత్రి పరసా వెంకటరత్నం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం హామీలు నెరవేర్చలేదని సంజీవయ్య చెప్పడం విడ్డూరంగా ఉందని, కళ్లతో చూస్తే అభివృద్ధి పనులు, హామీలు నెరవేర్చిన విషయం తెలుస్తుందన్నారు. ఉనికిని కాపాడుకొనేందుకు ఆయన అప్పుడప్పుడు నెల్లూరు నుంచి వచ్చి వెళుతుంటారని విమర్శించారు. తమ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసీపీకి లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. మాజీ మంత్రి పరసా మాట్లాడుతూ ఐదేళ్ల అధికారంలో ఉన్న వైసీపీ రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. 10 నెలలకే సీసీ రోడ్లు, రోడ్ల మరమ్మతులు చేసిన ఘనత టీడీపీదేనని స్పష్టం చేశారు. ఇచ్చిన హామీల్లో ఇప్పటికే ఉచిత గ్యాస్, పింఛన్ల పెంపు నెరవేర్చారని.. మే మాసంలో తల్లికి వందనం, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు హామీని త్వరలోనే నెరవేర్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, కొక్కు శంకరయ్య, చిట్టేటి పెరుమాల్, గాడి నారాయణరెడ్డి, వేనాటి మురళిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌ల సస్పెన్షన్



వివరాలను తెలుసుకుంటున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

వాకాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మరణించిన వారికి, గ్రామంలో లేనివారికి, చదువుకుంటున్న వారికి మస్టర్లు వేసి అక్రమాలకు పాల్పడ్డ కల్లూరు, ముట్టెంబాక ఫీల్డ్ అసిస్టెంట్‌లు శ్రీనివాసులు, పరంధామయ్యలను సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి రూ.8.28 కోట్ల రూపాయల ఉపాధిహామి పనులు మండలంలో జరిగాయన్నారు. ముట్టెంబాక ఫీల్డ్ అసిస్టెంట్ పరంధామయ్య, పలువురు వేతనదారుల పేరిట బినామీ మస్టర్లు వేయడంతో విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. కల్లూరు ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు పనిచేయని వారి పేర్లతోపాటు చనిపోయిన వారిపేర్లతో మస్టర్లు వేసి నిధులు డ్రాచేయడంతో సస్పెండ్ చేసినట్లు చెప్పారు. వాకాడు ఫీల్డ్ అసిస్టెంట్ పలు అవకతవకలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఏపీవో విజయమ్మ పనితీరులో నిర్లక్ష్యం వహించడంతో మందలించారు. కొన్ని పంచాయతీలలో పనులు జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, పురుషోత్తమరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గేట్‌లో ఎన్‌బీకేఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గేట్ పరీక్షల్లో ప్రతిభా పాటవాలు చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు అభినందించారు. దేశంలోని ఐఐటీలు పలు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన గేట్ 2025 ఫలితాల్లో ఎన్‌బీకేఆర్ మెకానికల్ విద్యార్థులు జాతీయస్థాయిలో సత్తా చాటినట్లు డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. మెకానికల్ 4వ సంవత్సరం చదువుతున్న వడ్డపూడి దినేష్, చింతమాను మహేష్‌లు ప్రొడక్షన్ ఇంజనీరింగ్ పేపర్‌లో జాతీయస్థాయిలో 309, 597 ర్యాంకలను, గేట్ ఇంజనీరింగ్ సైన్స్ పేపర్‌లో అశోక్ జాతీయస్థాయిలో 939 ర్యాంక్‌ను కైవసం చేసుకున్నట్లు విజయకుమార్‌రెడ్డి తెలిపారు. గేట్ మెకానికల్ ఇంజనీరింగ్ పేపర్‌లో మహేష్, అశోక్ 506, 6,790 ర్యాంక్‌లను సాధించారు. దీంతో ఆయా విద్యార్థులను డైరెక్టర్‌తోపాటు పలువురు విభాగాధిపతులు అభినందించారు.

విద్యతోపాటు ఆటలకూ ప్రాధాన్యమివ్వాలి



చిన్నారులకు ఆట వస్తువులను అందజేస్తున్న డాక్టర్ రోహిణి

గూడూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోపాటు ఆటలకు కూడా ప్రాధాన్యమివ్వాలని డాక్టర్ రోహిణి అన్నారు. స్థానిక తూర్పు వీధిలోని అంగన్‌వాడీ పాఠశాలలో గురువారం లాఫింగ్ డే సందర్భంగా చిన్నారులకు ఆటవస్తువులను అందజేశారు. ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచి అంగన్‌వాడీ పాఠశాలలలో పిల్లలకు ఆట, పాటలతో కూడిన విద్యను అందించాలన్నారు. దీంతో చిన్నారుల్లో మానసిక ఉల్లాసం పెరిగి చదువుల పట్ల ఆసక్తిని పెంపొందించుకుంటారన్నారు. కార్యక్రమంలో సీడీపీవో మెహబూబి, డాక్టర్ తనూజ, జీవని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు ధన్యవాదాలు

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ బిల్లును శాసనసభలో, శాసనమండలిలో ప్రవేశపెట్టినందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి సిసింద్రి గురువారం తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని అమలుపరిచేందుకు చర్యలు చేపడుతున్న సీఎంకు రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు

దొరవారిసత్రం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం ఉదయం రైలు ప్రమాదంలో గుర్తు తెలియని సుమారు 60 ఏళ్ల వృద్ధుడు మృతి చెందాడు. రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపు తీవ్ర గాయాలతో పడి ఉండగా, స్థానిక రైల్వే సిబ్బంది గుర్తించారు. వెంటనే 108 అంబులెన్స్ సాయంతో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతుడిని చికిత్స కోసం తరలించే సమయంలో తనది గొల్లపాళెం అని, ఇద్దరు ఆడపిల్లలు అని చెప్పి స్పృహ కోల్పోయినట్లు రైల్వేసిబ్బంది తెలిపారు. సూళ్లూరుపేట రైల్వే ఎస్‌ఐ మాలకొండయ్య, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించగా, బుధవారం వెంకటగిరి నుంచి నాయుడుపేటకు బస్సులో ప్రయాణించిన బస్సు టిక్కెట్, అలాగే వెంకటగిరి పట్టణంలోని శ్రీస్వామి మెడికల్ చీటి ఉన్నట్లు గుర్తించారు. దాంతో మృతుడు వెంకటగిరి పరిసర ప్రాంత వాసి అయి ఉండవచ్చని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని అదృశ్యం

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోన్న తనూజ అనే విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ గురువారం తెలిపారు. నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొమ్మలపూడికి చెందిన తనూజ విద్యానగర్‌లో ఇంజనీరింగ్ చదువుతోంది. సెలవులకు వచ్చి ఈ నెల 17వ తేదీన ఇంటి నుంచి కళాశాలకు వచ్చింది. అదే రోజు నుంచి విద్యార్థిని కనిపించకుండా పోయింది. దీంతో తల్లిదండ్రులు అన్ని చోట్లా విచారించినప్పటికీ ఆచూకీ దొరకలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఢీకొని కీమాన్ మృతి



మృతిచెందిన బాలకృష్ణ

గూడూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు ఢీకొని రైల్వే కీమాన్ మృతి చెందిన సంఘటన ఆలస్యంగా గురువారం వెలుగుచూసింది. రైల్వే జీఆర్ పోలీసుల కథనం మేరకు... స్థానిక రెండోపట్టణ పరిధిలోని ఎస్‌ఆర్‌పీ టాకీస్ సమీపంలో నివాసముంటున్న బాలకృష్ణ (40)ను బుధవారం గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందాడని తెలిపారు. గురువారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ల బదిలీ

కోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కోటలోని జాతీయ ఉపాధి హామి పథకం కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్‌లు కౌన్సెలింగ్‌లో బదిలీ అయ్యారు. ఇక్కడ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్ దొరవారిసత్రంకు, శాంతి చిల్లకూరుకు, కంప్యూటర్ ఆపరేటర్ సునీత నాయుడుపేట ఉపాధి హామి కార్యాలయాలకు బదిలీ అయినట్లు గురువారం ఆయా సిబ్బంది తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు జనసేన



బాలసదన్‌లో కేక్ కట్ చేస్తున్న జంపాల ప్రకాష్

వెంకటగిరి, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): జనసేన క్రమశిక్షణ గల పార్టీ అని, కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని వెంకటగిరి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త జంపాల ప్రకాష్ అన్నారు. ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని స్థానిక బాలసదన్‌లో గురువారం జంపాల ప్రకాష్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పిల్లలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాధమ్మ, చిరంజీవులు, మధు, వెంకటరమణ, టెంకాయిల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ వివరాలు సరి చూసుకోవాలి

పెళ్లకూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ క్రాప్ వివరాలు నమోదు చేయించుకున్న రైతుల వివరాలను ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు వ్యవసాయాధికారిణి గొడవర్తి ప్రవీణ గురువారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని పెళ్లకూరు, చిల్లకూరు, నెలబల్లి, పుల్లూరు, కలవకూరు, పాలచ్చూరు, చావాలి, శిరసనంబేడు, బంగారంపేట, చెంబేడు, పునబాక, తాళ్వాయిపాడు, కానూరు రైతు సేవా కేంద్రాల్లో వివరాలను ప్రదర్శించామని, రైతులంతా ఈ జాబితాలోని వివరాలు చూసుకుని ఏమైనా పొరపాట్లు ఉంటే సరి చేసుకోవాలన్నారు. వీఏఏలు చందు, దినేష్ తదితరులు ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం గురువారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పలు బహుళజాతి కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉపాధి అవకాశాలను కల్పించనున్నట్లు చెప్పారు. వివరాలకు 97005 61225 నంబరును సంప్రదించాలన్నారు.

గ్రీవెన్స్‌డే నిర్వహణలో మార్పులు

చిట్టమూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రంగా ఉండడం వలన గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో మార్పులు చేసినట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌డే కార్యక్రమం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ సమయంలోనే అర్జీలను సమర్పించుకోవాలని కోరారు.

పాఠశాలలో సరస్వతీపూజ

వాకాడు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్టెంబాక ప్రభుత్వ పాఠశాలలో గురువారం సరస్వతీదేవి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతీదేవి విగ్రహాన్ని విశేష పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుమూరు రమణయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, లక్ష్మీ, సర్పంచ్ అనిల్‌రెడ్డి, విద్యాకమిటీ ఛైర్మన్ కమల, రాజయ్య, శేషయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నత్తనడకన మినీ గోకులాలు

● కరువైన అధికారుల పర్యవేక్షణ



కోట మండలం గూడలిలో అసంపూర్తిగా ఉన్న మినీ గోకులం

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పశువుల సంరక్షణలో భాగంగా రైతులకు తోడ్పాటుగా గ్రామాల్లో రైతులనే లబ్ధిదారులుగా చేస్తూ ప్రభుత్వం మినీ గోకులాల (పశువుల షెడ్‌లు)ను మంజూరు చేసింది. అయితే అవగాహన లోపం, అధికారుల పర్యవేక్షణ కొరతతో ఆయా గోకులాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. కోట మండలంలోని 21 పంచాయతీలకు సంబంధించి 54 మినీ గోకులాల షెడ్‌లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి ఉపాధిహామి పథకం నిధులు మంజూరు చేసి, నిర్మాణంలో రైతులను భాగస్వాములుగా చేసింది. ఒక్కొక్క షెడ్ నిర్మాణానికి రూ.2.30 లక్షలు మంజూరు చేసింది. రైతు తన పెరటిలో ఈ షెడ్ నిర్మించుకుంటే ఉపాధిహామి పథకం అధికారులు పర్యవేక్షించి బిల్లులు చేయాల్సి ఉంది. అయితే 54 మినీ గోకులాలకు సంబంధించి కేవలం 44 గోకులాలు మాత్రమే నిర్మాణంలో ఉండగా, వీటిలో కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. మరో 10 గోకులాల నిర్మాణం ప్రారంభం కాలేదు. రైతులకు ఈ మినీ గోకులాలపై ఉపాధిహామి అధికారులు అవగాహన కల్పించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆశాఖలోని కొంత మంది అధికారులు నిర్మాణాలు జరగని మినీ గోకులాలకు కూడా జరిగినట్లుగా రికార్డులు సృష్టించి, బిల్లులు చేయించేందుకు ఆశాఖలోని టెక్నికల్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం. కోట మండలంలో జరుగుతున్న మినీ గోకులాల నిర్మాణాలపై ఉన్నతాధికారులు నిఘా పెడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మండల ప్రజలు కోరుతున్నారు.

తెలుగు సాహిత్యాన్ని ప్రపంచ దేశాల్లో చాటడమే లక్ష్యం

● ప్రవాస భారతీయురాలు, రచయిత్రి బీజీ షిరిడీ



అమెరికాలో తెలుగు సభల్లో పాటలు పాడుతున్న బీజీ షిరిడీ

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అచ్చమైన తెలుగు సాహిత్యాన్ని, సాంప్రదాయాలను పాటలు, సంగీత రూపంలో పాశ్చాత్య దేశాల్లో చాటిచెప్పడమే తన లక్ష్యమని ప్రవాస భారతీయురాలు, తెలుగుపాటల రచయిత, సంగీత దర్శకురాలు బీజీ షిరిడీ తెలిపారు. కోట పట్టణానికి చెందిన బీజీ షిరిడీ గత కొన్నేళ్లుగా అమెరికాలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుంది. ఆమె రెండు రోజుల క్రితం అమెరికా నుంచి స్వగ్రామమైన కోటకు వచ్చారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సాహిత్య విలువలతో, సరికొత్త సంగీతాన్ని అందించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. చిన్నతనం నుంచే సంగీతంతోపాటు చిత్రలేఖనం, ఫొటోగ్రఫీలో అనుభవం ఉన్నట్లు తెలిపారు. కోటకు అల్లుడైన ప్రముఖ సంగీత దర్శకుడు కాలూరి రాజేశ్వరరావు కుమారుడు కోటి స్ఫూర్తితో అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉంటూనే తెలుగులో పాటలు రాయడం, అమెరికాలోని తెలుగుసభల్లో తెలుగుబాణీలో పాటలు పాడుతూ వచ్చారు. తల్లిదండ్రులు నారాయణస్వామి-అరుణలు రిటైర్డ్ ఉపాధ్యాయులు అని తెలిపారు. జాతీయ సాంస్కృతిక శిబిరంలో ఎస్వీ యూనివర్శిటీ బృందంలో గాయనిగా, కీబోర్డు ప్లేయర్‌గా ప్రాతినిథ్యం వహించానన్నారు. కౌగిలి అనే తెలుగు సినిమాకు పాటలు రాసి స్వయంగా బాణీలు కుదిర్చానన్నారు. తెలుగుచిత్ర పరిశ్రమలో పాటలు రాయడం, పాడటం, సంగీతం అందించడానికి మరి కొద్దిరోజుల్లో ప్రముఖ గాయని సునీతతో కలసి రంగప్రవేశం చేయనున్నట్లు బీజీ షిరిడీ తెలిపారు.

హజరత్ అమీర్‌షావలి దర్గా ఉరుసు ఏర్పాట్లు ప్రారంభం



నాయుడుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట దర్గావీధిలోని హజరత్ అమీర్‌షావలి దర్గా 74వ ఉరుసును 9 సంవత్సరాల అనంతరం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం ఉరుసు ఏర్పాట్లను ప్రారంభించారు. నాయుడుపేటలో గత 65 సంవత్సరాలుగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఈ ఉరుసు గంథోత్సవం వైభవంగా జరిగేది. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి, రాష్ట్రాల నుంచి కూడా స్థానిక బంధువుల ద్వారా వచ్చేవారు. కొన్ని సంవత్సరాల క్రితం దర్గా వ్యవస్థాపక కమిటీ, వక్ఫ్‌బోర్డు ఏర్పాటు చేసిన కమిటీల మధ్య విభేదాలు తలెత్తడంతో ఉరుసును నిలిపివేశారు. టీడీపీ ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, దర్గా ఉరుసు ఛైర్మన్ మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యుల చర్చల అనంతరం ఏప్రిల్ 3వ తేదీన శ్రీవారి గంథం, 4న సినిమా పాటకచేరి, 5న అన్నదానం, జబర్దస్త్ టీమ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పూలే విగ్రహం వద్ద పారిశుధ్య చర్యలు చేపట్టాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ నేతలు

నాయుడుపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రబాయి పూలే విగ్రహాల వద్ద ప్రధాన డ్రైనేజీ ధ్వంసం కావడంతో ఆ ప్రాంతంలో పారిశుధ్య సమస్య నెలకొందని సీమాంధ్ర బీసీ సంఘ సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షుడు జువ్వలపాటి మస్తాన్ అన్నారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో గురువారం కమిషనర్ ఫజులుల్లాకు బీసీ సంఘ నాయకులతో కలసి వినతి పత్రం అందజేశారు. పూలే విగ్రహం వద్ద పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. బీసీ నాయకులు రామయ్య, శివ, ఆవుల వినోద్, ఎస్‌కె షరీఫ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన



కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రతినిధులు

సూళ్లూరుపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో వీఎస్‌ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై గురువారం అవగాహన కల్పించారు. మాంబట్టు పారిశ్రామిక వాడలోని టాటాకెమికల్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు నైపుణ్య శిక్షణ అంశంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎల్‌బి శంకర్‌శర్మ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు ఉద్యోగ నైపుణ్యాలు సాధిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీసీఎస్‌ఆర్‌డీ ప్రతినిధులు సతీష్, శ్రావణ్, కెరీర్ గైడెన్స్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, అకాడమిక్ కో ఆర్డినేటర్ ఉషార్ రాణి తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిం మహిళలకు దుస్తుల పంపిణీ



గూడూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పేదలకు సాయం చేయడమే రంజాన్ మాస ప్రత్యేకత అని లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ ఛైర్మన్ రియాజ్ అహ్మద్ అన్నారు. గురువారం స్థానిక దర్గా సమీపంలోని ఆయన నివాసం వద్ద తల్లి ఖాదర్‌ఉన్నీసాబేగం జ్ఞాపకార్థం సందర్భంగా పేద ముస్లిం మహిళలకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హఫీజ్ అహ్మద్, నూర్, చాన్‌బాషా, మగ్దూం, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

చిట్టమూరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు తహసీల్దార్ సతీష్‌కుమార్‌ను రెవెన్యూ అసోసియేషన్ జేఏసీ జిల్లా సెక్రటరీ పెళ్లూరు గోపీనాథ్ రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈయనతో పాటు రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్‌కుమార్, మండల సర్వేయర్ వెంకటేష్ ఉన్నారు.

చెందోడులో విద్యుత్ అదాలత్



విద్యుత్ సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న రైతు

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం గూడూరు డివిజన్ విద్యుత్‌శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరిగింది. ఈ అదాలత్‌కు రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్‌ఎల్ అంజనీకుమార్, స్వతంత్ర సభ్యులు విజయలక్ష్మి, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల విద్యుత్ వినియోగదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఆయా మండలాల్లో విద్యుత్ సమస్యలపై 15 మంది రైతులు వినతిపత్రాలు అందించారు. కొన్ని సమస్యలను అధికారులు అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటిని తర్వాత పరిష్కరిస్తామన్నారు. విద్యుత్ వాడకంపై రైతులు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏడీఈ చిన్నయ్య, ఆయా మండలాల ఏఈలు, సబ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

కోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కోటలోని మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.నారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గురుకులంలో ఆయా తరగతుల్లో ప్రవేశపరీక్షలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. 2024-25 విద్యా సంవత్సరాల్లో ఏదైనా పాఠశాలలో 4వ తరగతి, పదో తరగతి చదివిన విద్యార్థులకు పైతరగతుల ప్రవేశాలకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

దోమల నియంత్రణకు చర్యలు

సూళ్లూరుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొన్నారు. గురువారం పట్టణంలోని మురుగుకాలువల్లో దోమల మందును పిచికారీ చేయించారు. కమిషనర్ చిన్నయ్య ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలు రాత్రి ఫాగింగ్ చేసి, పగటిపూట దోమల మందును పిచికారీ చేయించారు. కాలువల్లో పలుచోట్ల మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో మలేరియా ఆయిల్ స్ప్రే చేశారు. దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

షాపుల వద్ద మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలి


సూళ్లూరుపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల వద్ద మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గురువారం సూళ్లూరుపేట ఎక్సైజ్‌పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సురేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. తడ - శ్రీకాళహస్తి రోడ్డులో మద్యం దుకాణాల పక్కనే మద్యం సేవించేందుకు బారుల్లా ఏర్పాట్లు చేశారని, వాటిని వెంటనే తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పరిశీలించి చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు. సీపీఐ నాయకులు నాగేంద్రబాలు, వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సూళ్లూరుపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని శ్రీహరికోట రోడ్డులో ఉన్న అంబేడ్కర్ గురుకులంలో గురువారం రాత్రి ఆరో తరగతి చదువుతున్న చందన అనే విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గురుకులంలో పరీక్షల రాసే విషయంలో తోటి విద్యార్థినితో చిన్నపాటి వివాదం తలెత్తడంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని చేతికి ఉన్న గాజులు పగలగొట్టి గాజుల పొడిని మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తోటి విద్యార్థినులు గురుకులం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో ఆ విద్యార్థినిని హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గూడూరుకు తరలించారు.

తీర ప్రాంతాల భద్రత కోసమే సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ

● సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్



సూళ్లూరుపేట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా తీర ప్రాంతాల భద్రత కోసం సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్ర సీఐఎస్ఎఫ్ సీనియర్ కమాండెంట్ సంజీత్ కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సీఐఎస్ఎఫ్ 56వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా దేశంలో పశ్చిమ, తూర్పు తీరాలను కలుపుతూ 6,553 కి.మీ మేర ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురక్షిత తీరం అనే నినాదంతో తీర ప్రాంత సమాజాలను, విద్యార్థులు, ఇతరులకు అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆయుధాలు, పేలుడు పదార్థాల వంటి ముప్పు గురించి యువతకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. మన రాష్ట్రంలో వైజాగ్‌లో ప్రారంభమైన ఈ ర్యాలీ 21న చీరాలకు చేరుకుంటుందని, 22న ఒంగోలు, 23న నెల్లూరుకు చేరి అదే రోజు రాత్రి నాయుడుపేటకు చేరుకుంటుందని చెప్పారు. 24న ఉదయం నాయుడుపేటలో బయలుదేరి సూళ్లూరుపేటకు చేరుకొని అక్కంపేట వద్దనున్న జైన్ టెంపుల్‌లో రాష్ట్రంలో ర్యాలీ ముగుస్తుందని వివరించారు. అక్కడ నుంచి అదే రోజు తమిళనాడు రాష్ట్రంలోకి చేరుకొంటుందని అన్నారు. చీరాల నుంచి తమిళనాడు సరిహద్దు వెళ్లేవరకు షార్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ఆధ్వర్యంలో ర్యాలీ జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన రూట్‌మ్యాప్ ఏర్పాట్లను సిద్ధం చేసుకొంటున్నట్లు ఆయన తెలిపారు.